నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
మంగళవారం | జులై 23, 2024 | www.navatelangana.com

మహిళా కమిషన్ చైర్మన్‌కు శుభాకాంక్షలు

నవతెలంగాణ-రామారెడ్డి


తెలంగాణ మహిళా కమిషన్ చైర్మెన్‌గా నేరెళ్ల శారద పదవీ బాధ్యతలు చేపట్టినందున సోమవారం ఆమెను మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి, పుష్పగుచ్చాలు అందజేశారు. కార్యక్రమంలో ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


శారదకు శుభాకాంక్షలు తెలుపుతున్న పలువురు

కళ్యాణి ప్రాజెక్ట్ నీటి విడుదల

నవతెలంగాణ-నిజాంసాగర్

ఎల్లారెడ్డి మండలంలోని కళ్యాణి ప్రాజెక్ట్‌కు భారీగా వరద నీరు చేరడంతో రెండు గేట్ల ద్వారా 650 క్యూసెక్కుల నీటిని నిజాంసాగర్ ప్రధాన కాలువకు వదిలినట్టు ఏఈఈ శివ తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 409.50 మీటర్లు కాగా ప్రస్తుతం 408.50 మీటర్ల నీరు ఉందని ఆయన తెలిపారు. ప్రాజెక్టులోకి ప్రస్తుతానికి 650 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుందని వివరించారు. కావున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని రైతులెవరూ కాలువలో దిగవద్దని ఆయన సూచించారు.


ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న నీరు

మాట తప్పితే పోరాటం తప్పదు

- ఆశావర్కర్లకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలి
- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్

నవతెలంగాణ-కంఠేశ్వర్/కామారెడ్డి

ఆశావర్కర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పితే పోరాటం తప్పదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ అన్నారు. సోమవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఆశావర్కర్ల సమస్యలపై ధర్నాచౌక్‌లో ధర్నా నిర్వహించారు. ఆశావర్కర్ల పోరాటానికి సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు సంఘీభావం తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించకుంటే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. ఆశావర్కర్లకు 15 రోజుల సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు, కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో పొందుపర్చిన హామీలు, 2024 ఫిబ్రవరి 9న ఆరోగ్య శాఖ కమిషనర్ ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18,000లు ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ, ప్రమాదబీమా, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తదితర సమస్యలు పరిష్కరించాలన్నారు. జిల్లావ్యాప్తంగా అనేక ఆందోళనా-పోరాటాలు నిర్వహించినా తమ సమస్యలు నేటికీ పరిష్కారం కాలేదన్నారు. తద్వారా జిల్లావ్యాప్తంగా ఆశావర్కర్లు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. కావున పై అంశాలను పరిశీలించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మోహన్, యూనియన్ జిల్లా కార్యదర్శి విజయ, జిల్లా కోశాధికారి రేణుక, జిల్లా ఉపాధ్యక్షురాలు సుకన్య, రేణుక, రమా, బాలమణి, లలితా, శోభ, సిహెచ్ నర్సా, సాహేరా, వహీదా, రేవతి, భూలక్ష్మి, సౌజన్య, సలీమా, రాధా తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి : రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఆశావర్కర్లు కామారెడ్డి కలెక్టరేట్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశావర్కర్ జిల్లా అధ్యక్షురాలు ఇంద్ర, జిల్లా కార్యదర్శి రాజశ్రీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆశావర్కర్లను పర్మినెంట్ చేస్తామని మ్యానిఫెస్టోలో పెట్టినా.. ఆశావర్కర్ల సమస్యలు మాత్రం పరిష్కరించడం లేదన్నారు. ఆశావర్కర్ల పట్ల కాంగ్రెస్ పార్టీ చిన్న చూపు చూస్తుందన్నారు. కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, తమతో అదనపు పనులు చేయించవద్దని, అధికారుల ఒత్తిళ్లు తమపై మానుకోవాలని అన్నారు. కరోనా సమయంలో ప్రజలంతా ఇండ్లకే పరిమితమైనా.. ఆశావర్కర్లు మాత్రం ప్రజలకు సేవచేసి ప్రజలను కాపాడిన చరిత్ర గుర్తించి ఇండియన్ గ్లోబ్ సంస్థ ఆరోగ్య ఆశావర్కర్లకు అవార్డు ప్రకటించిందన్నారు. ఇప్పటికైనా ఆశావర్కర్ల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని లేనిపక్షంలో సిఐటియూ ఆధ్వర్యంలో ఎంతటి పోరాటాలకైనా సిద్ధంగా ఉన్నామన్నారు. దీనికి కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత వహించవలసి ఉంటుందని సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ ఈ ధర్నాకు సిఐటియు నాయకులు ప్రభాకర్, కాట్రియాల ప్రభు అధ్యక్షతన వహించగా.. ఆశావర్కర్ల నాయకులు మంజుల, పద్మ, రేణుక, గంగామణి, సుధా, భాగ్యలక్ష్మి, ప్రమీల, లలిత, 350 మంది ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.


కంఠేశ్వర్ : ధర్నాచౌక్ వద్ద మహాధర్నాలో పాల్గొన్న ఆశావర్కర్లు, నాయకులు


కామారెడ్డి : కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశావర్కర్లు

కడుపులోనే శిశువు మృతి

డెలివరీ కోసం వెళితే సకాలంలో అందని వైద్యం

- బోధన్ జిల్లా ప్రభుత్వాస్పత్రిలో ఘటన
- శిశువు మృతదేహంతో ఆర్డీవో కార్యాలయం ఎదుట బాధితుల ఆందోళన

నవతెలంగాణ-బోధన్

బోధన్ ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి డెలివరీ కోసం వెళ్లిన గర్భిణీకి వైద్యం సకాలంలో అందకపోవడంతో కడుపులోనే శిశువు మృతిచెందింది. ఈ ఘటన సోమవారం చోటుచేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. ఆచన్‌పల్లికి చెందిన ఓ గర్భిణీని ఆమె కుటుంబీకులు ప్రసవం కోసం బోధన్ జిల్లా ప్రభుత్వాసుపత్రికి సోమవారం తీసుకువెళ్లారు. దాంతో వైద్య సిబ్బంది ఉదయం ఆసుపత్రిలో చేర్చుకున్నారు. గర్భిణీ 11 గంటల నుండి మధ్యాహ్నం వరకు ఆసుపత్రిలో ఉన్నా.. గైనకాలజిస్ట్ లేకపోవడంతో సక్రమంగా వైద్యం అందలేదు. అప్పటికే గర్భిణీకి పురిటినొప్పులు ఎక్కువయ్యాయి. మధ్యాహ్నం వేళ 'ఇక్కడ వైద్యులు లేరు. నిజామాబాద్‌కు వెళ్లండి' అంటూ ఆసుపత్రి సిబ్బంది చెప్పడంతో గర్భిణీ కుటుంబ సభ్యులకు తెలుపడంతో ఆందోళన చెందిన ఆమె కుటుంబీకులు బోధన్‌లోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే పరిస్థితి చేయిదాటిపోవడంతో మహిళ కడుపులోని శిశువు మృతి చెందినట్టు వైద్యులు తెలిపి డెలివరీ చేశారు. జిల్లా ప్రభుత్వాస్పత్రిలో వైద్యుల కొరతను నిరసిస్తూ బాధిత కుటుంబీకులు బోధన్ ఆర్డీవో కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. బోధన్ ప్రభుత్వాసుపత్రికి తక్షణమే వైద్యులను నియమించి నిరుపేద రోగులను ఆదుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ బోధన్ ఇంచార్జి జునైద్ అహ్మద్ డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో వైద్యులు లేరని ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఇప్పటికైనా ఆస్పత్రిని సందర్శించి వైద్యుల నియామకం చేపట్టి, రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆయన డిమాండ్ చేశారు.


శిశువు మృతదేహంతో ఆందోళన


ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న బాధితుల బంధువులు

ప్రాణాలు పోతేగాని.. పట్టించుకోరా..?

- దారి మధ్యలో కూలిన వంతెన

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని పెద్దపొతంగల్ గ్రామ పంచాయతీ పరిధిలోని కర్ణంగడ్డ తండాలో గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తండాకు వెళ్లే దారిలో వంతెన 90 శాతం కూలిపోవడంతో ప్రమాదకరంగా మారింది. దీంతో రోడ్డు గుండా వెళ్లాలంటే తండా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని తండా వసూలు కోరుతున్నారు గత సంవత్సరం కాలంగా వంతెనకు మరమ్మతులు చేపట్టాలని అధికారులను, ప్రజాప్రతినిధులను కోరినా పట్టించుకోలేదని ప్రాణాలు పోతేగానీ పట్టించు కోరా అని తండా ప్రజలు ప్రశ్నిస్తున్నారు.


ప్రమాదకరంగా వంతెన కూలిన ప్రాంతం

పోచారంలోకి కొత్తనీరు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని పోచారం ప్రాజెక్టులో కొత్తనీరు చేరుతుంది. గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి ఎగువ ప్రాంతాలలో చెక్‌డ్యాంలు నిండడంతో పోచారం ప్రాజెక్టులోకి ఉత్తర నీరు చేరుతున్నట్లు ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు. ఎగువ ప్రాంతాలైన గాంధారి, గుండారం లింగంపేట్ ప్రాంతాలలో వర్షాలు భారీగా కురవడంతో ఎగువ ప్రాంతాలలో నుంచి పోచారం ప్రాజెక్టులోకి కొత్తనీరు చేరుతున్నట్లు డిఈ తెలిపారు. జీరో స్టోరేజ్‌లో ఉన్న పోచారం ప్రాజెక్టు ప్రస్తుతం 6:30 అడుగులు నీరుచేరినట్లు డిఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు. పోచారం ప్రాజెక్టు నీటిమట్టం పెరుగుతూ ఉండడంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


ప్రాజెక్టులోకి చేరుతున్న నీరు

చెరువులా 'పాఠశాల ప్రాంగణం'

- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందుల్లో విద్యార్థులు

నవతెలంగాణ-వర్ని

మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలికల పాఠశాల ప్రాంగణంలో వర్షం నీరు చేరి నిండు చెరువులా మారింది. విద్యార్థులు నడిచి వెళ్లేందుకు అడుగు వేయలేని దుస్థితి నెలకొంది. విద్యార్థులు కాలు జారిపడి బురదలో పడే ప్రమాదముంది. పాఠశాల ఆవరణలో నీరు నిలవడంతో దోమలు, కప్పలు వృద్ధిచెందుతున్నాయి. తద్వారా దుర్వాసన వెదజల్లుతోంది. మధ్యాహ్న భోజనమూ చేయలేని దుస్థితి నెలకొంది. అధికారులు స్పందించి నీరు తొలగించేలా చూడాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.


చెరువును తలపిస్తున్న పాఠశాల ఆవరణ

లోన్ మాఫీ అయ్యిందా.. లేదా?

తెలుసుకునేందుకు బ్యాంకులకు అర్హులైన రైతుల పరుగులు

- సరైన సమాధానమివ్వని బ్యాంకు సిబ్బంది
- అయోమయంలో అన్నదాతలు

నవతెలంగాణ-ఎడపల్లి

లక్షలోపు రుణాలు తీసుకున్న రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవలే మాఫీ చేసింది. ఈ నేపథ్యంలో లక్షలోపు రుణం పొందిన రైతులు తమలోను మాఫీ అయ్యిందా లేదా అన్నది తెలుసుకునేందుకు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. కానీ బ్యాంక్ అధికారులు మాత్రం రైతులకు సరైన సమాధానం తెలుపకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఎడపల్లి మండలంలోని ఆరు బ్యాంకులున్నాయి. ఎడపల్లి మంగల్‌పాడ్ కెనరాబ్యాంక్, తానాకాలాన్‌లో ఎస్బిఐ బ్యాంక్, జానకంపేటలో హెచ్‌డిఎఫ్‌సి, జానకంపేట రైతులకు సారంగాపూర్ పరిధిలోని ఎస్బిఐ, పోచారం రైతులకు దూపల్లిలో విజయ బ్యాంకు పరిపధిలో ఖాతాలున్నాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వం లక్షలోపు రుణాలు మాఫీ చేయడంతో రైతులు తమ బ్యాంకు ఖాతా పుస్తకాలను పట్టుకుని బ్యాంకులకు క్యూ కడుతున్నారు. రైతులు తమ రుణమాఫీ ఎంత మాఫీ అయిందోనని అధికారులను అడిగి తెలుసుకోవడానికి ప్రయత్నిస్తే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఎడపల్లి కెనరా బ్యాంకులో ప్రింటింగ్ మిషన్‌ను ఏర్పాటు చేశారు. రుణమాఫీ పోగా.. మిగతా ఎన్ని డబ్బులు ఉన్నాయో చూసుకోవడానికి, ప్రింటింగ్ తీసుకోవడానికి ఆప్షన్ తెలువకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే తంతూ ప్రతీ బ్యాంక్‌లో కొనసాగుతోంది. జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, సంబంధిత బ్యాంక్ ఉన్నతాధికారులు స్పందించి రైతుల ఇబ్బందులు తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


ఎడపల్లి కెనరా బ్యాంక్‌లో ఖాతా పుస్తకం ప్రింటింగ్ తీసుకునేందుకు ఇబ్బందులు పడుతున్న రైతులు

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బి.ప్రసాద్

నవతెలంగాణ-గాంధారి

కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చిన 6 గ్యారంటీలను వెంటనే అమలు చేయాలి సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బి.ప్రసాద్ డిమాండ్ చేశారు. కామారెడ్డి సిపిఐ(ఎం) జిల్లా విస్తృతస్థాయి సమావేశాన్ని గాంధారిలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం 2023 అసెంబ్లీ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలను 6 గ్యారంటీలను సత్వరం అమలు చేయాలని అన్నారు. వ్యవసాయ కూలీలకు, మహిళలకు ఆర్థికసాయం అందజేయాలన్నారు. రైతులకు ఈ వానకాలం నుంచి రైతు భరోసా అమలు చేయాలని, పంటల బీమా పథకాన్ని రైతాంగానికి ఉపయోగపడే విధంగా బీమా ప్రీమియం ప్రభుత్వం భరించి అమలు చేయాలని ధరణి సమస్యలు పరిష్కరించాలని, రెండులక్షల లోపు రుణమాఫీ అమలు చేయాలని అన్నారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా ధాన్యానికి, ఇతర పంటలకు బోనస్ ఇవ్వాలని తెలిపారు. పోడు భూములకు పట్టాలివ్వాలని, వ్యవసాయ ప్రణాళిక వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని, జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని అన్నారు. అన్ని రకాల పెన్షన్లను పెంచాలని, ఇండ్ల స్థలాలు లేని వారందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి ఇందిరమ్మ పథకం కింద ఆర్థిక సహాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ప్రభుత్వమిచ్చిన హామీల కోసం పోరాటాలు నిర్వహిస్తామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్‌తో పాటు జిల్లా కమిటీ సభ్యులు మోతీరాంనాయక్, చంద్రశేఖర్, సురేష్‌గొండ, నర్సింలు, అజయ్, ప్రకాష్, కిషన్‌రావు, గేమ్‌సింగ్, మధు, రాములు, రోజా, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బుర్రి ప్రసాద్

ప్రజావాణిలో 91 ఫిర్యాదులు

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి కలెక్టర్ కార్యాలయ ఆవరణలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో 91 ఫిర్యాదులు వచ్చినట్లు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదులను ఆన్లైన్లో నమోదు చేయాలని సూచించారు. వచ్చిన ఫిర్యాదులను శాఖల వారీగా పంపి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డిఆర్డిఓ చందర్, డిపిఓ శ్రీనివాసరావు, సిపిఓ రాజారాం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, కలెక్టరేట్ ఏవో మసూర్ అహ్మద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్

హుండీ లెక్కింపు

నవతెలంగాణ-బోధన్

పట్టణంలోని శ్రీ మారుతి మందిరం హుండీని దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారులు సోమవారం లెక్కించారు. ఈ సందర్భంగా దేవాలయానికి 3 నెలలకు గాను రూ.31,585 ఆదాయం వచ్చినట్టు ఎండోమెంట్ అధికారి కమల తెలిపారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్, ఈవో రవీందర్ గుప్తా, జూనియర్ అసిస్టెంట్ రాములు, ఆలయ అర్చకులు ప్రవీణ్ మహారాజ్ భక్తులు పాల్గొన్నారు.

నూతన పంచాయతీ కార్యదర్శికి సన్మానం

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని ఈసన్నపల్లి పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన నరేష్ బదిలీపై మాచారెడ్డి మండలం చుక్కాపూర్‌కు వెళ్ళగా.. ఆయన స్థానంలో లింగంపేట్ మండలం కోమటిపల్లి గ్రామపంచాయతీలో పనిచేసిన సత్యవతి బదిలీపై వచ్చే పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆమెను కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కందూరి పెద్ద లింబాద్రి, రాజేందర్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎంపీఓకు ఘన సన్మానం

నవతెలంగాణ-కోటగిరి

మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీవోగా విధులు నిర్వహిస్తున్న బి.మారుతి వర్ని మండలానికి బదిలీ కావడంతో మండల పరిషత్ అధికారులు, దళిత నాయకులు ఘనంగా సన్మానించారు. గత ఆరు సంవత్సరాల నుంచి మండల అభివృద్ధి పనులు పరిశీలించి మంచి పేరు తెచ్చుకున్నారని నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో మనోహర్‌రెడ్డి, దళిత నాయకులు మిర్జాపూర్ సాయన్న, పుప్పల సాయిలు, బేగరి రాములు, సైదయ్యా శివశంకర్, విజయ్, తిర్మలాపూర్ సాయిలు, పాల గంగారాం, దౌలయ్యా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఇలా.. వెళ్ళేది ఎలా..?

- దుర్భరంగా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే దారి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

పట్టణ కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం పక్కనే ఒకేచోట వరసగా ఒకే ప్రాంగణంలో ఒకదాని పక్కన మరొకటి ఐదు ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. వర్షాలు పడితే ఆ ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు సోమవారం ఆ దారిలో వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వివిధ కార్యకలాపాలు, సేవల నిమిత్తం అవసరాల కోసం నిత్యం ప్రజలు వెళ్లే ఆర్డీవో కార్యాలయం, ఐకెపి మహిళా సమైక్య, విద్యాశాఖ, వ్యవసాయ శాఖ కార్యాలయాలకు వెళ్లి అధికారులను కలవాలంటే ఈ రోడ్డు దాటాల్సిందే. బురదమయంగా మారిన ఈ దారిపై వెళ్లాలంటే స్థానిక ప్రజలు జంకుతున్నారు. బురద రోడ్డును బాగు చేయాలని కార్యాలయాలకు వెళ్లే ప్రజలు కోరుతున్నారు.


దుర్భరంగా మారిన దారి

జీజీహెచ్‌లో ఢిల్లీ బృందం పర్యటన

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లాలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సోమవారం ఢిల్లీ నుంచి వచ్చిన నలుగురు సభ్యుల బృందం సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా గాలి ద్వారా ప్రబలే వ్యాధుల గురించి ఎలాంటి జాగ్రత్తలు పాటిస్తున్నారో తెలుసుకోవడానికి బృందం (అసెస్‌మెంట్) వచ్చినట్లు తెలిసింది. ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రతిమారాజ్‌ను కలిసి టిబి వార్డ్, ల్యాబ్, బ్రోంకస్కోప్, ఓపి విభాగాలవద్ద ఎయిర్ బోన్ ఇంఫెక్షన్ కంట్రోల్ మార్గదర్శకాల ప్రకారం పాటించవలసిన పద్ధతుల గురించి చర్చించారు. అనంతరం ప్రతీ విభాగాన్ని తనిఖీ చేస్తూ ఇన్ఫెక్షన్ వ్యాపించకుండా తీసుకుంటున్న జాగ్రత్తల గురించి శానిటేషన్ వర్కర్స్‌ను ఆరాతీశారు. ఈ బృందంలో డాక్టర్ భరత్, పార్థసారధి, జావీద్, డాక్టర్ ప్రమోద్‌రెడ్డి, హెచ్ఓడి డాక్టర్ డివివి రావు, డాక్టర్ ఉదయ్ కృష్ణ, జిల్లా టిబి కోఆర్డినేటర్ రవి, రమ్య పాల్గొన్నారు.


రోగులను అడిగి వివరాలు తెలుసుకుంటున్న ఢిల్లీ బృందం

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న హెల్త్ ఎడ్యుకేటర్

నవతెలంగాణ-బాల్కొండ

వర్షాకాలంలో విజృంభించే సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని డిస్టిక్ హెల్త్ ఎడ్యుకేటర్ సిహెచ్. మురళి విద్యార్థులకు సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం సీజనల్ వ్యాధులపై వైద్యాధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, టైఫాయిడ్ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ నివారణ చర్యల గురించి తెలియజేశారు. అనంతరం పాఠశాలల్లోని వంటగదిని, మధ్యాహ్నం భోజనం ప్రక్రియను పరిశీలించి వంట సిబ్బందికి సలహాలు, సూచనలు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్ నుంచి మహిళ అదృశ్యం



నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నుండి ఒక మహిళ అదృశ్యమైనట్లు నిజామాబాద్ ఒకటవ పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓ విజయ్ బాబు తెలిపారు. ఎస్ హెచ్ ఓ విజయ్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. బాల్కొండ గ్రామానికి చెందిన సకినా పెంటు వయస్సు (60) తన కూతురు గర్భవతి అయినందున డెలివరీ గురించి ఈనెల 2న రోజున గవర్నమెంట్ హాస్పిటల్‌లో అడ్మిట్ చేశారు. ఈనెల 4న సాయంత్రం నాలుగు గంటల సమయంలో టీ తీసుకొని వస్తానని వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఆమెకోసం అంతటా వెతికి పోలీస్ స్టేషన్లో ఆదివారం ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. హాస్పిటల్ నుండి వెళ్లేటప్పుడు గ్రీన్ కలర్ కుర్తా పింక్ కలర్ వైట్ కలర్ చున్ని ధరించి ఉన్నది. ఈ విషయంపై కేసు నమోదు చేసి కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఒకటవ పోలీస్ స్టేషన్ విజయ్ బాబు తెలిపారు.

దాశరథికి ఘన నివాళులు


దాశరథి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలుగు వైతాళికులు దాశరథి కృష్ణమాచార్యుల శత జయంతి సందర్భంగా నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బార్ అధ్యక్షుడు జగన్ మోహన్ గౌడ్ మాట్లాడుతూ.. దాశరథి కవిగా, రచయితగా, హైదరాబాద్ సంస్థాన పోరాట యోధుడిగా, సాహితికారునిగా బహుముఖ సేవలు అందించారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి ప్రేరణగా నిలిచిన పద్యగేయం కోటి రతనాల వీణ నా తెలంగాణ దాశరథి నిజాం పాలనకాలంలో జైలుశిక్ష అనుభవించిన నిజామాబాద్ జైలు గోడలపైనేనని ఆయన అన్నారు. తెలుగునేలపై సాహితి సుమాలు వెదజల్లి ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల్లోని జనజీవనంలో మమేకమై సాహితీమూర్తిగా అభివర్ధించారు. కార్యక్రమంలో బార్ ఉపాధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి వసంత్ రావు, కార్యదర్శి డొన్పల్ సురేష్, కోశాధికారి దీపక్, న్యాయవాదులు రాజ్ కుమార్ సుబేదార్, పరుచూరి శ్రీధర్, మాజీ పిపి మధుసూదన్ రావు, సుదర్శన రావు, ఆశా నారాయణ, స్నేహ, బిట్ల రవి, అరేటి నారాయణ, నిశాంత్, ఏర్గట్ల గణేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో చదివి ప్రయోజనకులైన వారెందరో


విద్యార్థులతో ఉపాధ్యాయులు

నవతెలంగాణ-భీమ్‌గల్‌రూరల్

ప్రభుత్వ పాఠశాలలో చదివి ప్రయోజనకులైన వారెందరో ఉన్నారని ఎంపీడీవో సంతోష్ కుమార్ అన్నారు. వనమహోత్సవంలో భాగంగా బెజ్జోరా, ముచ్కూర్ గ్రామాలను సోమవారం సందర్శించారు. బెజ్జోరా గ్రామంలో అమ్మ ఆదర్శ పాఠశాల పనులపై సమీక్ష చేశారు. బెజ్జోరలో ప్రభుత్వ ఉపాధ్యాయుల పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చదవడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. వర్షాకాలం సీజన్ ప్రారంభమైనందున సిజనల్ వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. వర్షాలు భారీగా కురుస్తున్నందున వన మహోత్సవం టార్గెట్‌ను పూర్తిచేయాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి గంగామోహన్ ఉపాధి హామీ ఏపీవో జి.నర్సయ్య, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లల్ని చదివిస్తూ ఆదర్శంగా నిలిచారని పాధ్యాయులను అభినందించారు.

దుబ్బ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

- ప్రజావాణిలో ఎస్ఎఫ్ఐ నాయకుల ఫిర్యాదు


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్


అస్తవ్యస్తంగా విద్యుత్‌బోర్డు


వంగిపోయిన ఫ్యాన్ రెక్కలు

నిజామాబాద్‌నగరంలోని దుబ్బ పాఠశాలలో మౌలిక సదుపాయాలను కల్పించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దుబ్బ పాఠశాలలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుకు సోమవారం ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విగ్నేష్ మాట్లాడుతూ.. ఈనెల 19న దుబ్బ పాఠశాలలను సర్వే చేశామన్నారు. మొత్తంగా 463 మంది విద్యార్థులుంటే వారికి క్లాస్ రూమ్స్ సరిగ్గా లేకపోవడం బాధాకరమని అన్నారు. అదేవిధంగా పాఠశాలల్లో మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థినులకు, లేడీ టీచర్లకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలల్లో కనీస వసతులు 9వ తరగతి పదవ తరగతి విద్యార్థులకు రూమ్స్ లలో ఫ్యాన్స్ కానీ, లైట్స్ కానీ లేకపోవడం విడురమని అన్నారు. సరిగ్గా స్విచ్ బోర్డ్స్ లేకపోవడంతో విద్యార్థులకు షార్ట్ సర్క్యూట్స్ అయితే ప్రమాదం పొంచి ఉందని అన్నారు. దీంతో పాటు పాఠశాలలో విద్యార్థుల చదువు కోసం ప్రొజెక్టర్లు ఉపయోగించిన సరైన ఇంటర్నెట్ ఫెసిలిటీ లేకపోవడంతో చదువు అందని ద్రాక్షగా మారిందని అన్నారు. అదేవిధంగా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ని కోరగా వారు సానుకూలంగా స్పందించి దుబ్బ పాఠశాలను అభివృద్ధి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాజు, వినీత్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు

- భారీ వర్షాలతో కోత
- ప్రతి ఏడాది ఇదే పరిస్థితి
- ఏళ్ళు గడిచినా మరమ్మతులు కరువు
- గుంతలను నింపి చేతులు దులుపుకుంటున్న అధికారులు
- గుంతలతో పొంచి ఉన్న ప్రమాదం
- హైలెవల్ వంతెన నిర్మించాలంటున్న ప్రజలు


ప్రమాదకరంగా మారిన్న కల్వర్టు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రం నుండి ఉప్లూర్ వెళ్లే దారిలో వరద కాలువ దిగువన బీటిపై ఉన్న కల్వర్టు ప్రమాదాలకు ఆస్కారంగా మారింది. మూడు రోజులగా కురిసిన వర్షాలకు వచ్చిన భారీ వరద నీటితో గతంలో కల్వర్టు గుంతల్లో పోసిన మొరం పూర్తిగా కొట్టుకుపోయి మారుమారు కల్వర్టు, బీటి రోడ్డు కోతలకు గురయ్యాయి.

గత కొన్ని సంవత్సరాల క్రితం కురిసిన భారీ వర్షాలకు మొదటిసారి కల్వర్టు కోతకు గురయ్యింది. కల్వర్టుకు ఇరువైపులా పెద్ద గుంతలు ఏర్పాడ్డాయి. అప్పటినుండి ఆ గుంతలను అధికారులు తాత్కలికంగా మొరంతో నింపి చేతులు దూలుపేసుకుంటున్నారు. ఇలా భారీ వర్షాలు కురిసిన ప్రతిసారి వరద తాకిడికి గుంతల్లో వేసి మొరం కొట్టుకుపోవడం, అధికారులు వాటిని మొరంతో నింపి కవర్ చేయడం శరమమూలుగా మారింది. రెండు సంవత్సరాల క్రితం కురిసిన అతి భారీవర్షాలకు కల్వర్టుల ఇరువైపులా పెద్ద ఎత్తున కోతకు గురై పెద్ద గుంతలు ఏర్పాడ్డాయి. ఆ సమయంలో భారీగా వచ్చిన వరదతో కల్వర్టుల కాలువ కూడా కోతకు గురవ్వడంతో పంట పొలాల్లోకి వరద నీరు చేరి ఇసుక, మట్టి మేటలు వేశాయి. రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అప్పుడు కూడా తాత్కలికంగా మళ్ళీ మొరంతో నింపి వదిలేశారే తప్ప అధికారులు శాశ్వత పర్కిషారం కోసం చర్యలు చేపట్టలేదు. గత సంవత్సరం కూడా ఇదే పరిస్థితి ఏర్పడింది. పెద్ద ఎత్తున కల్వర్టులు ధ్వంసమై రెండేళ్ళు గడుస్తున్నా మరమ్మత్తులు చేపట్టకపోవడంతో రహదారి గుండా వెళ్ళే వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉండడమే కాకుండా కల్వర్టు దిగువన పంట పొలాలు భారీ వర్షాలు కురిసిన సందర్భంలో నీట మునుగుతున్నాయి.

కమ్మర్‌పల్లి గ్రామ శివారులో ఉప్లూర్ వెళ్ళే రోడ్డులో భూములు పల్లంగా ఉన్నందున వర్షపు వరద నీరు, పంట పొలాల నీరు ఉప్లూర్ వైపు ప్రవహిస్తోంది. పదేళ్ళ క్రితం కమ్మర్‌పల్లి శివారు గుండా శ్రీరాం సాగర్ ప్రాజెక్టు వంద కాలువ నిర్మాణం జరిగింది. కమ్మర్‌పల్లి వైపు నుండి వర్షపు వరద, పంట పొలాల నీరు దిగువకు ప్రవహించే మార్గం లేకపోవడంతో ఈ ప్రాంతంలో పంట పొలాలు నీట మునిగి, పంటలు దెబ్బ తినండంతో వరద కాలువ కిందుగా అండర్ టన్నెల్ నిర్మించారు. ఈ టన్నెల్ గుండా బయటకు వెళ్ళే వరద నీరు, వరద కాలువ తూము నుండి ఉప్లూర్ చెరువులోకి వరద కాలువ నీరు ప్రవహించేందుకు వీలుగా బిటి రోడ్డు కిందుగా పైపు వేసి కల్వర్టు నిర్మించి, కాలువ తవ్వారు. భారీ వర్షాలు కురిస్తే ఈ కాలువ గుండా నీటి ప్రవాహం జోరుగా ఉంటుంది. రెండేళ్ళ క్రితం వర్షా కాలంలో భారీ వర్షాలతో ఈ కల్వర్టు గోడలు పూర్తిగా విరిగి పడ్డాయి. దీంతో బిటి రోడ్డు పైన వర్షపు నీరు నేరుగా కాలువలోకి ప్రవహించి ఆ సమయంలో కల్వర్టు దిగువన గల పంట పొలాలు నీట మునిగా యి. అప్పటి నుండి కల్వర్టు మరమ్మత్తులు నోచుకోనేలేదు. దీంతో భారీ వర్షాలు పడ్డ

ప్రతిసారి క్రమంగా కల్వ ర్టు రెండు వైపుల గోడల భాగం నుండి బిటి రోడ్డు అంచు వరకు రోడ్డు కోతకు గుంయ్యింది. బీటి రోడ్డు సగం వరకు కోతకు గురువ్వడంతో పాటు పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. భారీ వర్షాలు కురిసిన ప్రతిసారి వరద ప్రవాహం ఎక్కువగా ఉండడం, కాలువ, కల్వర్టు కింద వేసిన పైపు చిన్నగా ఉండడంతో వరద నీరు బీటి రోడ్డు మీదుగా కల్వర్టు పైనుండి ప్రవహిస్తుంది. ఆ సమయంలో ఈ రోడ్డు గుండా ఇరు గ్రామాలకు రాకపోకలు సాగడం లేదు. ఇటీవల కురిసిన అతి భారీ వర్షాలతో వచ్చిన వరదకు గత సంవత్సరం గుంతల్లో నింపిన మొరం పూర్తిగా కొట్టుకుపోయింది.

గుంతలతో పొంచి ఉన్న ప్రమాదం....

భారీ వర్షాలతో కల్వర్టుల వద్ద ఏర్పడ్డ గుంతలతో ఈ రోడ్డు గుండా రాత్రి వేళల్లో ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశముంది. బీటి రోడ్డు సగం వరకు కోతకు గురవ్వడంతో ప్రస్తుతం ఈ రోడ్డులో ఒక వైపు నుండి మాత్రమే రాకపోకలు సాగుతున్నాయి. రాత్రి పూట వాహనదారులు ఆదమరిచి కల్వర్టువైపు వెళితే గుంతల్లో పడి ప్రమాదాలకు గురయ్యే ఆస్కారం ఉంది. గత సంవత్సరం ఈ గుంతలోకి ఒక కారు దూసుకెళ్ళి పల్టీ కొట్టిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా దెబ్బతినగా, అందులో ప్రయాణించిన వ్యక్తి స్వల్పంగా గాయాలు అయ్యాయి.

భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు కల్వర్టు ప్రదేశంలో హైలెవల్ వంతెన తీరుగా కల్వర్టు నిర్మించాల్సి ఉంది. ఇందుకు గత ప్రభుత్వంలో మంత్రి ప్రశాంత రెడ్డి రూ.50లక్షలు నిధులు కూడా మంజూరు చేయించి, పనులకు శంకుస్థాపన కూడా చేశారు. తీరా ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారండంతో గతంలో మంజూరు చేసిన పనులను ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయడంతో పనులు నిలిచిపోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి హైలెవల్ వంతెన నిర్మించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

- మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ మాలిక్



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

కొత్తగా పాసుబుక్ వచ్చిన రైతులు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ మాలిక్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. కొత్తగా పట్టా పాస్ బుక్ వచ్చిన రైతులు మాత్రమే రైతు బీమాకు ఆగస్టు 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కొత్త పట్టాదారు రైతులకు జూన్ 28 వరకు పట్టా పాస్ బుక్ వచ్చి ఉండాలని, ఇంతవరకు కూడా రైతు బీమా చేసుకోకపోయిన రైతులు మాత్రమే రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. రైతు బీమాకు దరఖాస్తులు చేసుకునేందుకు దరఖాస్తు ఫారంతో పాటు రైతు పట్టా దారు పాస్ బుక్ (లేదా) తహసిల్దార్‌తో డిజిటల్ సంతకం అయిన డిఎస్ పేపర్, రైతు ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డు జత చేయాలన్నారు. నామిని మైనర్ అయితే అప్పాయింటి మేజర్ అయి ఉండాలని, వీరి ఇద్దరివీ ఆధార్ కార్డు జిరాక్స్‌లు ఏఈఓ సమక్షంలో దరఖాస్తు మీద సంతకం చేసి ఇవ్వాలని తెలిపారు. 14 ఆగస్టు 1965 నుండి 14 ఆగస్టు 2006 మధ్యలో పుట్టిన రైతులు మాత్రమే ఈ రైతు బీమాకి అర్హులని పేర్కొన్నారు. ఆధార్ కార్డులో 18 సంవత్సరాలు నుండి 59 సంవత్సరాలు వయస్సు ఉన్న రైతులు మాత్రమే బీమా చేసుకోవాలని సూచించారు. గతంలో బీమా చేసుకున్న రైతులు బీమాలో మార్పులు చేర్పులు, ఆధార్‌లో లేదా నామిని చనిపోతే మార్పులు కొరకు మాత్రం జూలై 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని వివరించారు.

బాల్కొండ: మండల పరిధిలోని అన్ని గ్రామాల రైతులు ఈ సంవత్సరం నూతనంగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతులు, ఇదివరకు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోని రైతులు రైతు బీమాకు సంబంధిత క్లస్టర్ ఏఈఓ వద్ద దరఖాస్తు చేసుకోవాలని సోమవారం మండల వ్యవసాయ అధికారి మహేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ 18 నుండి 59 సంవత్సరాల లోపు వయస్సు ఉండి అర్హత కలిగిన రైతులు దరఖాస్తులు చేసుకోవాలని, గత సంవత్సరం ఆగస్టు నుండి ఈసంవత్సరం జూన్ 28వరకు కొత్తగా పట్టా పాసు బుక్కు పొందిన రైతులు, గతంలో పట్టాదారు పాసు బుక్కు పొంది ఇప్పటివరకు రైతు బీమాకు దరఖాస్తు చేసుకొని రైతులు, నామిని వివరాలు ఏమైనా మార్పులు ఉంటే సంబంధిత ఏఈఓని కలిసి రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలనీ కోరారు. పట్టాదారు రైతు స్వయంగా ఏఈఓ వద్దకు వచ్చి దరఖాస్తు ఇవ్వాలనీ సూచించారు.

ప్రభుత్వం వెంటనే బీసీ డిక్లరేషన్ ప్రకటించాలి

- ఎంఆర్‌వోలకు వినతి

నవతెలంగాణ-బాల్కొండ/నవీపేట్/మాక్లూర్


నవీపేట్ : వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

తెలంగాణ రాష్ట్ర బీజేపీ ఓబీసీ మోర్చా పిలుపు మేరకు సోమవారం బాల్కొండ ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు కళ్లెం సుధాకర్ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి ఎంఆర్ఓ అద్ద శ్రీధర్ కు వినతిపత్రం అందజేశారు. ఓ బి సి మోర్చ మండల అధ్యక్షులు కళ్లెం సుధాకర్ మాట్లాడుతూ కామారెడ్డిలో రేవంత్ రెడ్డి బీసీ డిక్లరేషన్ చేస్తానని మాటిచ్చి ఆరునెలలు గడుస్తున్న బీసీ డిక్లరేషన్ ప్రకటించకుండా కాలయాపన చేస్తూ బీసీలను మోసం చేస్తున్నారని అన్నారు. వెంటనే బీసీ డిక్లరేషన్ ప్రకటించాలని లేకుంటే బీసీ ఉద్యమం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు అంబటి నవీన్, బీజేవైఎం మండల అధ్యక్షులు జక్కం శ్రీకాంత్, ఎస్సి మోర్చా మండల అధ్యక్షులు అంగారి రాజలింగం, ఐటీ సెల్ మండల కన్వినర్ కొత్తింటి రాకేష్, బూత్ అధ్యక్షులు గౌరు శివానంద్, ఉట్నూర్ రాంకిషన్, కొమ్ము రాజేశ్వర్, మగ్గిడి లింగం, ఓబిసి నాయకులు రంగు శివకుమార్, బోధస్ గంగరాజాం, నానం నర్సయ్య బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నవీపేట్: బీసీ డిక్లరేషన్ చేయాలని బిజెపి ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో తహసిల్దార్ నారాయణకు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బిజెపి ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు గంగోని రాము మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి కామారెడ్డిలో ఎన్నికల సందర్భంగా బీసీ డిక్లరేషన్ చేస్తానని హామీ ఇచ్చి 8 నెలలు గడుస్తున్నా ఇప్పటికే ఊసెత్తకపోవడం సిగ్గుచేటని అన్నారు. వెంటనే బీసీ డిక్లరేషన్ చేపట్టి రాష్ట్రంలో ఉన్న అత్యధిక జనాభా గల బీసీలకు సరైన న్యాయం చేయాలని అన్నారు. లేనియెడల బిజెపి ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు శివప్రసాద్, బిజెపి మండల అధ్యక్షులు సరిన్, సీనియర్ నాయకులు వంశీ మోహన్, పుట్ట శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీటీసీ మైసరాద, పిల్లి శ్రీకాంత్, సొసైటీ డైరెక్టర్ గణేష్, ప్రధాన కార్యదర్శులు ఆనంద్, రాజేందర్ గౌడ్, నాయకులు భూషణ్, బండారి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మాక్లూర్: మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు మండల ఓబిసి మోర్చ ఆధ్వర్యంలో ఓబిసి డిక్లరేషన్ చేయాలంటూ నిరసన తెలిపి, తహసీల్దార్ షబ్బీర్‌కు వినతి పత్రాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కామారెడ్డి ప్రచారంలో బిసి డిక్లరేషన్ చేస్తానని చెప్పిన హామీ ఏమైందని సిఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. వెంటనే బిసి డిక్లరేషన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఓబిసి మోర్చా మండల అధ్యక్షులు బొబ్బిలి రమేష్, బీజేపీ మండల అధ్యక్షులు సురేష్, ఉపాధ్యక్షులు రవి యాదవ్, నాయకులు సంతోష్, అసెంబ్లీ కన్వీనర్ గంగోని వినోద్, మాజీ సర్పంచ్ అనిల్ కుమార్, సంజీవ్, రమేష్ నాయక్, చౌహన్ అశోక్, దామ రాజేశ్వర్, శివలాల్, నరేందర్, రాజు, ప్రణీత్, సిసింద్రీ, ధర్మపతి, ప్రసాద్, సంతోష్, గంగాధర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల బెడదనుండి కాపాడాలని వినతి

నవతెలంగాణ-మాక్లూర్

కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్లు సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా నాయకులు కొండ గంగాధర్ మాట్లాడుతూ కేవీపీఎస్ సర్వేలో భాగంలో అనేక గ్రామాలు తిరుగుతున్న సందర్భంగా గ్రామాల్లో సీజనల్ వ్యాధులు, డెంగ్యూ చలి జ్వరాలు, బోదకాలు సంబంధించిన వ్యాధులు ప్రబలి గ్రామస్తులు బాధలు పడుతున్నారన్నారు. కల్లెడ, గుత్ప, మామిడి పల్లి గ్రామాల్లో వారంలో ఒక్క రోజు హెల్త్ క్యాంపులు నిర్వహించాలని, సీజనల్ వ్యాధుల నుండి ప్రజలను కాపాడాలని అన్నారు. గ్రామాల్లో కుక్కలు ఎక్కువైయ్యాయని, ఇబ్బందులు పాలు చేస్తున్నాయని తెలిపారు. విద్యార్థులు పాఠశాలకు వెళ్తున్న సందర్భంగా వారి వెంట పడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయన్నారు. కావున కుక్కల బెడదను నివారించాలని కోరారు. కార్యక్రమంలో కుల వ్యవస్థ వ్యతిరేక పోరాట సంఘం జిల్లా నాయకులు, మండల నాయకులు చిన్నయ్య, రాజు, మైపాల్, గంగాధర్, జగన్ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ప్రభుత్వ న్యాయవాదులు


సన్మానించిన ప్రభుత్వ న్యాయవాదులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ కోర్టు తాత్కాలిక గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమితులైన న్యాయవాది వెంకటరమణ గౌడ్ నిజామాబాద్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్ తాత్కాలిక అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడరుగా నియమితులైన పి.రాజు లు సోమవారం జిల్లా కోర్టు తమ కార్యలంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షులు మల్లెపూల జగన్మోహన్ గౌడ్ పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ బాధ్యతలు ప్రభుత్వ ప్రజా పక్షన నిర్వహించాలని భవిష్యత్తులో మరిన్ని ఉన్నతమైన స్థానాలకు ఎదగాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వసంత్ రావు, డాన్పల్ సురేష్, సీనియర్ న్యాయవాదులు ఎం గోవర్ధన్, జి వి కృపాకర్ రెడ్డి, రాజలింగం, రాజారెడ్డి, రాజ్కుమార్ సుబేదార్, మానిక్ రాజ్, అశ నారాయణ, పులి జైపాల్, సతీష్, ఉదయ్, కేశ్వరావ్, నర్సయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల కార్మికుల సమస్యలపై తహశీల్దార్‌కు వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ-మాక్లూర్

గుత్ప, అలీ సాగర్ లిఫ్ట్ కార్మికులు సమస్యలు తీర్చాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహశీల్దార్ షబ్బీర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా సిఐటియు నాయకులు కొండ గంగాధర్ మాట్లాడుతూ.. గుత్ప, అలీ సాగర్ ఎత్తిపోతల ఇరిగేషన్ కార్మికులు, పంపు వద్ద పనిచేసే కార్మికులకు ఐదు నెలల నుండి కాంట్రాక్టర్ వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. ఈ విషయం జిల్లా అధికారులకు తెలియజేసినప్పటికీ పట్టించుకోవడం లేదని, బెదిరింపులకు కూడా పాల్పడుతున్నారని వాపోయారు. ఇందులో పంపు ఆపరేటర్స్, గార్డెన్స్, వాచ్మెన్స్, క్లీనర్స్ వారం రోజుల నుంచి సమ్మె నిర్వహిస్తున్నారని, కార్మికులకు పీఎఫ్ కట్టకుండా కనీస వేతనం కూడా ఇవ్వకుండా వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. కాంట్రాక్టర్ తక్షణమే జీతాలు విడుదల చేయాలని కోరారు. జిల్లా అధికారులు తక్షణమే స్పందించాలని తెలిపారు. కార్యక్రమంలో లిఫ్ట్ ఇరిగేషన్ అధ్యక్షుడు, కార్మికులు పాల్గొన్నారు

పోలీస్‌స్టేషన్ ఆవరణలో వన మహోత్సవం

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో సోమవారం వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆవరణలో మొక్కలు నాటి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హెచ్.శ్రీనివాస్, రెంజల్ ఎస్ఐ ఈ.సాయన్న, ఏపీఓ రమణ, గ్రామ కార్యదర్శి రాజేంద్రరావు, సాంకేతిక సహాయకులు రాజేశ్వర్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, క్షేత్ర సహాయకులు శోభన్, కానిస్టేబుల్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న ఎంపీడీవో, ఎస్సై

వృద్ధాశ్రమంలో వన మహోత్సవం

నవతెలంగాణ-ఎడపల్లి

మండల పరిధిలోని వృద్ధాశ్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఎడపల్లి ఆధ్వర్యంలో వన మహోత్సవంలో భాగంగా క్లబ్ ప్రతినిధులు సోమవారం మొక్కలు నాటారు. వృద్ధాశ్రమంలో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఎడపల్లి ఎల్లప్పుడూ సహకారం అందిస్తుందని క్లబ్ అధ్యక్షులు మనోజ్ కుమార్ అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసర ప్రాంతంలో మొక్కలు నాటుకోవాలని ఆయన కోరారు. చెట్లు, మొక్కలు మానవ మనుగడకు ఎంతో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఎడపల్లి అధ్యక్షులు మనోజ్ కుమార్, కోశాధికారి గంగారెడ్డి, లయన్స్ క్లబ్ ఎడపల్లి మాజీ కదం ప్రకాష్‌రావు, మెర్సీ (రాధా), పుష్పలత, లయన్స్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న పలువురు

బీడీ కార్మికులకు రూ.4016 ఇవ్వాలి

- బీడీ కార్మికుల ర్యాలీ, ధర్నా

నవతెలంగాణ-బోధన్

బీడీ కార్మికులకు ప్రభుత్వం రూ.4016 జీవనభృతి మంజూరు చేయాలని కోరుతూ సోమవారం బోధన్ పట్టణంలో ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టీయూ) ఆధ్వర్యంలో బీడీ కార్మికులు మహాలక్ష్మి మందిర్ నుంచి షర్బత్ కెనాల్, అంబేద్కర్ చౌరస్తా, రైల్వే గేటు, మున్సిపల్ కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి ఆర్డీఓ అంబాదాస్ రాజేశ్వర్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఐఎఫ్టీయూ జిల్లా ఉపాధ్యక్షులు మల్లేష్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డి బీడీ కార్మికులకు చేసిన వాగ్దానం ప్రకారం రూ.4016 జీవనభృతిని మంజూరి చేయాలని డిమాండ్ చేశారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండగా బీడీ కార్మికులందరికీ జీవనభృతిని ఇస్తానని చెప్పి, కటాఫ్ డేట్‌ను తొలగించకుండా 2014 ఫిబ్రవరి 28 తరువాత పిఎఫ్ నంబర్లు కలిగిన వారికి ఇవ్వకుండా మోసం చేసిందని అన్నారు. దాంతో మాట తప్పిన టిఆర్ఎస్ పార్టీని మొన్నటి ఎన్నికల్లో ఓడించారన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి బీడీ కార్మికులు గెలిపించారని, రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో బీడీ కార్మికులకు ఇస్తున్న జీవనభృతిని రూ.2016/- నుండి రూ.4016/- రూపాయలకు పెంచి కటాఫ్ డేటును తొలగించి అధికారంలోకి రాగానే 100 రోజుల్లో ఇస్తానని వాగ్దానం చేశారని అన్నారు. ఇప్పటికి 200 రోజులు గడిచిపోయిన బీడీ కార్మికులకు చేసిన వాగ్దానాన్ని అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. బీడీ కార్ఖానాలు కేంద్ర ప్రభుత్వ విధానాల మూలంగా సరిగా నడవడం లేదని దానితో కార్మికులకు సరిపడా పని లేక వారి కుటుంబాల జీవనం దుర్భరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న బీడీ కార్మికులతో పాటు బీడీ ప్యాకర్స్, నౌకర్ స్టాఫ్, నెలసరి ఉద్యోగులు, గంపా వాలా, చాటన్ వాల, బట్టీ, కమిషన్ దారులు అందరికీ ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ.4016 జీవనభృతిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనియెడల అసెంబ్లీని కూడా ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం అధ్యక్షులు పడాల శంకర్, కార్యదర్శి సుల్తాన్ సాయిలు, ప్రగతిశీల మహిళా సంఘం పట్టణ అధ్యక్షురాలు బి.నాగమణి, ఐఎఫ్టీయూ నాయకులు డి.పోశెట్టి, బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు వి.గంగామణి, శోభ, బుజ్జి, అనిత, కళావతి, తులసి, పద్మ గోదావరి బీడీ కార్మికులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న బీడీ కార్మికులు, నాయకులు

రైతు బీమా.. కాంగ్రెస్ ధీమా

- రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి
- రైతుబంధు మండల సమితి మాజీ అధ్యక్షులు నాగరాజ్ గౌడ్



నవతెలంగాణ-కామారెడ్డి

పట్టా పాస్ బుక్ ఉన్న రైతులు రైతుబీమా చేసుకోని వారు దరఖాస్తులు చేసుకోవాలని బీబీపేట్ మాజీ మండల రైతుబంధు సమితి అధ్యక్షులు అంకన్నగారి నాగరాజుగౌడ్ తెలిపారు. రైతులు జూన్ 28 వ తేదీ వరకు నూతనంగా పట్టా పాస్ బుక్ పొందిన రైతులు 18 సంవత్సరాల నుండి 59 సంవత్సరాల లోపు వయస్సు వారు రైతుబీమాకు అర్హులని వివరించారు. 2024-25 సంవత్సరానికి గానూ బీమా దరఖాస్తు చేసుకోవాలని ఆయన రైతులకు సూచించారు. బీమా నమోదు చేసుకున్న రైతు మరణిస్తే రైతు కుటుంబానికి ప్రభుత్వం ఐదులక్షల రూపాయల బీమా ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. ఒక్క గుంట నుంచి ఎన్ని ఎకరాలున్నా.. రైతు అయినా ప్రమాదవశాత్తు లేదా ఏ ఇతర కారణాల వల్ల మరణించినా రైతు కుటుంబాలు ఆగం కావొద్దని.. వారిని ఆర్థికంగా అదుకునే ఉద్దేశంతో వారి సంక్షేమం కోసం లబ్ధి చేకూరుస్తూన్న రైతుబీమా పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం యధావిధిగా కొనసాగించడం హర్షణీయమన్నారు.

లింగంపల్లిలో కంటి వైద్య శిబిరం


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని లింగంపల్లి గ్రామంలో సోమవారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ లయన్స్ క్లబ్ బాన్సువాడ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించినట్టు కంటి వైద్య నిపుణులు హరి కిషన్ రావు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు 54 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. ఇందులో 12 మందికి మోతిబిందు గుర్తించామని కంటి వైద్య పరీక్షలు నిమిత్తం రెఫర్ చేసినట్టు వివరించారు. అదేవిధంగా 17 మందికి దృష్టిలోపాన్ని గుర్తించి వారికి మందులు పంపిణీ చేశామని తెలిపారు. మిగతా వారికి కంటిలోపాలను గుర్తించామని దృష్టిలోపమున్నవారు కంటి సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ రమేష్, ఏఎన్ఎం రాజమణి, శ్రావణి, ఆశావర్కర్లు తదితరులున్నారు.

అదనపు తరగతి గదులను నిర్మించాలి

- ప్రజావాణిలో వినతి

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలంలోని అమ్దాపూర్ గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం అదనపు గదులు నిర్మాణం కొరకు ప్రభుత్వం రూ.80 లక్షల నిధులను మంజూరు చేసిందని ఆ పనులను చేపట్టడానికి టెండర్‌లో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పాత గదులను కూల్చివేశారని, కానీ దాని స్థానంలో అదనంగా తరగతి గదులను నిర్మించలేదని దాంతో విద్యార్థులు ఉన్న గదులను కోల్పోయి కొత్త గదులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆ సమస్యను పరిష్కరించాలని కోరుతూ సోమవారం గ్రామస్తులు సిర్ప సుదర్శన్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. నిధులు మంజూరై నెలలు గడుస్తున్నా.. సంబంధిత కాంట్రాక్టర్ ఇప్పటివరకు పనులు ప్రారంభించలేదని, దాంతో తరగతి గదులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. అలాగే కస్తూర్బాగాంధీ పాఠశాల భవన నిర్మాణం అసంపూర్తిగా నిలిచిందని దానిని పూర్తి చేయాలన్నారు. జి ప్లస్ టు విధానంలో నిర్మిస్తున్న కస్తూర్బాగాంధీ పాఠశాల భవనం అసంపూర్తిగా నిలిచిందని సంబంధిత కాంట్రాక్టర్ చనిపోవడంతో పనులు సాగడం లేదన్నారు. కావున మరో కాంట్రాక్టుకు ఈ పనులు అప్పగించి భవన నిర్మాణం పూర్తి చేయాలని పేర్కొన్నారు. ప్రస్తుతం చాలీచాలని గదులలో విద్యార్థినులు అసౌకర్యంగా అవస్థలు పడుతూ ఉంటున్నారని అన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సుదర్శన్

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

- సూచించిన మండల వ్యవసాయాధికారులు

నవతెలంగాణ-విలేకరుల బృందం

దోమకొండ : జూన్ 28 తేదీవరకు నూతన పట్టాదారు పుస్తకం పొందిన వారు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని ఏవో పవన్ తెలిపారు. రైతులు తమ రైతుబీమా దరఖాస్తు పత్రంతో పాటు పట్టాదారు పాస్ బుక్ జిరాక్స్, ఆధార్ కార్డ్ జిరాక్స్, నామినీ ఆధార్ కార్డ్ జిరాక్స్‌లను ఏఈవోలకు రైతు వేదికలలో అందజేయాలని తెలిపారు. ఈ పథకాన్ని 18 నుంచి 59 సంవత్సరాలు ఉన్న ప్రతి రైతు జులై 22వ తేదీ నుంచి ఆగస్టు 5వ తేదీ లోపల దరఖాస్తు చేసుకుని వినియోగించుకోవాలన్నారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి..

నిజాంసాగర్ : రైతు బీమాకు ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని రైతులు వెంటనే రైతుబీమాకు మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ విస్తరణ అధికారి రేణుక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు బీమా ఉన్నవారు గత సంవత్సరంలో మరణిస్తే ఆ భూమిని వారి కుటుంబ సభ్యుల పేరు మీదికి జూన్ 28 లోపు పట్టాను మార్చుకుంటే వారు రైతుబీమాకు మీసేవలో దరఖాస్తు చేసుకోవాలని, అందుకు ఆగస్టు 5 వరకు గడువు ఉందని పేర్కొన్నారు. గతంలో బీమా చేసుకున్న వాళ్లు దరఖాస్తు చేయొద్దని సూచించారు. కానీ బీమాలో మార్పులు ఆధార్‌కార్డు మార్పు గానీ నామిని మరణిస్తే నామిని మార్పు కోసం, దానిలోని సవరణలకు జూలై 30 వరకు దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు. బీమా కోసం 18 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాల వయస్సు ఉన్న రైతులు మాత్రమే బీమా చేసుకోవాలని ఆమె తెలిపారు. పూర్తి వివరాలకు వ్యవసాయ శాఖ నిజాంసాగర్‌లో సంప్రదించాలని ఆమె తెలిపారు.

పాసుబుక్ ఉన్న రైతులకు బీమా తప్పనిసరి..

లింగంపేట్ : కొత్తగా పట్టా పాస్ పుస్తకాలు పొందిన రైతులు రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి అనిల్ కుమార్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగా పాస్‌బుక్ వచ్చిన రైతులు రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని గ్రామంలో సంబంధిత పంచాయతీ కార్యదర్శులు టామ్ టామ్ నిర్వహించి రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. జూలై 30 తేదీ వరకు రైతుబీమా కొరకు అవకాశం ఉందన్నారు. గతంలో బీమా చేసుకున్న రైతులు బీమాలో మార్పులు చేర్పు ఆధార్ లేదా నామిని చనిపోతే మార్పులు సైతం చేసుకోవచ్చన్నారు. కొత్తగా రైతుబీమా చేసుకొని రైతులు దరఖాస్తు ఫారం పట్టాదారు పాసుపుస్తకం ఆధార్‌కార్డు నామిని ఆధార్ కార్డు జతపరిచి రైతు వేదికలోని వ్యవసాయ విస్తీర్ణ అధికారికి దరఖాస్తు ఫారం ఇవ్వాలని ఆయన అన్నారు.

మద్నూర్ : మద్నూర్, డోంగ్లి, ఉమ్మడి మండలంలో కొత్తగా పట్టాదారు పుస్తకం పొంది ధరణి పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ గత నెల జూన్ 28కి పూర్తి చేసుకుని 18 నుంచి 59 ఏళ్ల వయసు ఉన్న రైతులు రైతుబీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఉమ్మడి మండల వ్యవసాయ అధికారి రాజు తెలిపారు.

బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి

- బిజెపి ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ధర్నా


ఆర్ఐకి వినతిపత్రం అందజేస్తున్న బిజెపి ఓబీసీ మోర్చా నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని బిజెపి ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి ఆర్ఐ నరసింహారెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఓబీసీ మోర్చా నాయకులు మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి ఎన్నికల సభలో బీసీ డిక్లరేషన్ ద్వారా తెలంగాణ రాష్ట్రంలోని బీసీల కులగణన చేసి బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా బీసీలకు రిజర్వేషన్లు పెంచుతామన్నారు. స్థానిక సంస్థల్లో ప్రస్తుతం ఉన్న బీసీ రిజర్వేషన్లు 23 శాతం నుంచి 42 శాతానికి పెంచుతామని హామీ ఇచ్చారన్నారు. ప్రభుత్వ కన్‌స్ట్రక్షన్స్ మెయింటెనెన్స్ కాంట్రాక్టులో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తామన్నారని పేర్కొన్నారు. గొల్ల, కుర్మలకు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే వచ్చిన 100 రోజుల్లోనే రెండవ దశ గొర్రెల పంపిణీకి సంబంధించిన రెండులక్షల రూపాయలు లబ్ధిదారుల అకౌంట్లలో వేస్తామన్నా.. డబ్బులు వేయలేదని తెలిపారు. ఇచ్చిన హామీని మరిచి కాంగ్రెస్ పార్టీ గొల్ల కురుమలను మోసం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి, కామారెడ్డి జిల్లా ఇన్చార్జ్ మాదా స్వామి యాదవ్, జిల్లా అధ్యక్షులు తోట బాలరాజు, జిల్లా జనరల్ సెక్రెటరీ కాసర్ల రాజలింగం, కామారెడ్డి పట్టణ ఓబిసి అధ్యక్షులు ఉప్పు లక్ష్మీపతి, జనరల్ సెక్రెటరీ నిట్టు రఘు, కామారెడ్డి రూరల్ ఓబీసీ అధ్యక్షులు పంపరి నర్సింలు, పట్టణ ఉపాధ్యక్షులు చిరంజీవి, రాజు, మహేందర్, జిల్లా ఓబీసీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట ప్రకారం బిసి డిక్లరేషన్‌ను అమలు చేయాలి

నవతెలంగాణ-భిక్కనూర్

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం బీసీ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలని రాష్ట్ర బిజెపి ఓబిసి మోర్చా ఆధ్వర్యంలో సోమవారం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శివ ప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను మరిచి కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తుందని, వెంటనే బీసీ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలని లేనిచో అన్ని కలెక్టర్ కార్యాలయాల ముందు దీక్షలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఓబిసి మండల అధ్యక్షుడు శంకర్, బిజెపి మండల అధ్యక్షులు రమేష్, నాయకులు రాజయ్య, యాదగిరిగౌడ్, నర్సింలు, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-మద్నూర్

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. సోమ వారం మండల కేంద్రంలోని పాత బస్టాండ్‌లో ప్రయాణికులకు, గ్రామస్తులకు పోలీస్ సిబ్బంది సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ, కానిస్టేబుల్‌లు, హోంగార్డులు పాల్గొన్నారు.

గంగమ్మ వాగుకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలి

- మాజీ ఎంపీపీ దశరథ్ రెడ్డి
- బిఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలో ఆదివారం కురిసిన భారీ వర్షానికి గంగమ్మ వాగు వద్ద వాహనాలు వెళ్లడానికి ప్రమాదంగా ఉండడంతో గంగమ్మ వాగుకు వెంటనే తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని మాజీ ఎంపీపీ దశరథ్ రెడ్డి డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అసంపూర్తిగా నిర్మించిన బ్రిడ్జి వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ దశరథ్ రెడ్డి మాట్లాడుతూ.. గత బిఆర్ఎస్ ప్రభుత్వం గంగమ్మ వాగు బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయగా, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పనులు నత్తనడకన నిర్వహిస్తున్నారని, వాగు ఉధృతంగా పారడంతో మండల ప్రజలు జిల్లా కేంద్రానికి వెళ్లడానికి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు అవుతున్న పనులు నత్తనడకన నడుస్తున్నాయని, ఆర్అండ్‌బి, ఎమ్మెల్యే స్పందించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని అన్నారు. గత ప్రభుత్వంలో మంజూరైన పనులను నిర్వహించలేని చేతగాని ప్రభుత్వం, అసమర్థత ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు. తాత్కాలిక మరమ్మతులు చేపట్టకపోతే ఆర్అండ్‌బి, ఎమ్మెల్యే కార్యాలయాలను ముట్టడించడానికి కూడా వెనుకాడమని హెచ్చరించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు గురిజాల నారాయణరెడ్డి, పడిగెల శ్రీనివాస్, ఉప్పల్వాయి మాజీ సర్పంచ్ గంగారం, బొమ్మిడి రామ్ రెడ్డి, జంగం లింగం, కన్నాపూర్ మాజీ సర్పంచ్ రాజనర్సు, పోతునూరి ప్రసాద్, కూడెల్లి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.


నిరసన చేపడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఐఏఎస్ అధికారి స్మిత సబర్వాల్‌పై చట్టరిత్యా చర్యలు తీసుకోవాలి

- ఎన్పీఆర్డీ ఆధ్వర్యంలో నిరసన


నిరసన చేస్తున్న ఎన్పీఆర్డీ వికలాంగుల సంఘం సభ్యులు

నవతెలంగాణ-బోధన్

వికలాంగుల పట్ల సోషల్ మీడియాలో వివక్ష చూపుతూ ఉన్నత ఉద్యోగాలలో రిజర్వేషన్ల పట్ల వ్యాఖ్యానించిన ఐఏఎస్ అధికారిని స్మిత సబర్వాల్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ఎన్‌పిఆర్‌డి వికలాంగుల సంఘం ఆధ్వర్యంలో బోధన్ ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపి ఆర్డిఓ అంబాదాసు రాజేశ్వర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎన్.పీ.ఆర్.డీ మండల అధ్యక్షులు గైని రాములు మాట్లాడుతూ.. వికలాంగుల పట్ల చులకనగా మాట్లాడుతూ అవమానపరిచిన ఐఏఎస్ అధికారిని స్మిత సబర్వాల్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వికలాంగులను అవమానించే హక్కు ఆమెకు ఎవరిచ్చారని నిలదీశారు. ఆమె ఒక ఐఏఎస్ అధికారిగా ఉండి వికలాంగుల పట్ల వివక్ష చూపించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తక్షణమే స్మిత సబర్వాల్ ఆమె వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్.పీ.ఆర్.డీ జిల్లా నాయకులు నజీర్, బి.రామచందర్‌రావు, పల్లికొండ చింటూ, ఎల్లయ్య, సలీమ్, నిహాల్, రామ్‌పటేల్, సాయిలు, అమీన్, తహముది పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందిస్తలే

నవతెలంగాణ-ఎల్లారెడ్డి


సంక్షేమ హాస్టల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని ఆరోపిస్తూ ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో బీసీ విద్యార్థి విభాగం ఎల్లారెడ్డి అసెంబ్లీ అధ్యక్షులు, ఆర్టిఐ రాష్ట్ర కార్యదర్శి లింగమయ్య ఆధ్వర్యంలో వినతిపత్రం సోమవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ హాస్టల్లో చదివే విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నపిల్లలకు ఎదిగే వయసులో సరైన పౌష్టికాహారం అందకపోతే భవిష్యత్తులో వారి ఆరోగ్యం దెబ్బతింటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి బిఎస్‌పి పట్టణ అధ్యక్షులు మర్లు సాయిబాబా, లేగల రాజు, తదితరులు పాల్గొన్నారు.

సంవత్సర కాలంగా వెలగని హైమాస్ లైటింగ్

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని పండంపల్లి గ్రామంలో సంవత్సర కాలంగా హైమాస్ లైట్ వెలగకపోవడంతో గ్రామంలోని ముఖ్యమైన కూడలీ హనుమాన్ టెంపుల్ వద్ద సాయంకాలం వేల చిమ్మ చీకటి ఏర్పడింది. ఐదు లక్షల వ్యయంతో మాజీ ఎంపి బిబి పాటీల్ మండలంలోని పలు గ్రామాలకు తన ప్రత్యేక నిధుల నుంచి మంజూరు చేశారు. మండలానికి గుత్తేదారుడు ఉన్నప్పటికీ తనకున్న గ్యారంటీ పీరియడ్ చేయవల్సిన పనులను చేయకపోవడం, అధికారులకు గుత్తేదారునికి ప్రశ్నించక పోవడంతో గుత్తేదారుడు అడిందే ఆట పాడిందే పాటగా కొన సాగుతోంది. గ్యారంటి పీరియడ్ ఉంటే గుత్తేదారుడు చేయాలని, లేకుంటే గ్రామ పంచాయతీ నిధుల నుండి కేటాయించి హై మాస్‌లైట్ రిపేర్ చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చెరువుకు జలకళ



నవతెలంగాణ-పోతంగల్

మండలంలో గత మూడు రోజులుగా వర్షాలు కురవడంతో చెరువు నిండి జళకళ సంతరించుకుంది. ఈ నీటిని వృథా చేయకుండా కట్టడి చేస్తే ఉపయోగంగా ఉంటుందని రైతులు కోరుతున్నారు.

మద్నూర్‌లో భారీ వర్షం

నవతెలంగాణ-మద్నూర్

మండలంలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. రెవెన్యూ అధికారుల నివేదికల ప్రకారం 64.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

వర్షానికి కూలిన ఇల్లు

నవతెలంగాణ-మద్నూర్

గత 2,3 రోజులుగా కురుస్తున్న ముసురు వర్షానికి మండలంలోని లచ్చన్ గ్రామంలో ఆదివారం రాత్రి ఇల్లు కూలి నేల మట్టమైంది. కూలిపోయిన ఇంట్లో ఇద్దరు అన్నాదమ్ములు ఉంటారు. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి హాని జరగ లేదు. ముసురు వర్షంతో కూలిపోయిన ఇంటిని ప్రభుత్వం ఆదుకోవాలని నిర్వాసితులైన మీరేవార్ చాందు, సురేష్, ఇరు కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేశారు.

పెద్దవాగుకు జలకల.. రైతుల్లో ఆనందం

నవతెలంగాణ-లింగంపేట్

ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలల గడుస్తున్నా ఎట్టకేలకు పెద్దవాగులో జలకళ సంతరించుకుంది. దీంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు వర్షాలు సమృద్ధిగా కురువకపోవడంతో పెద్ద వాగు పరిసర ప్రాంతాల్లోని ఆయకట్టు రైతులు వరి పంటలు సాగు చేయలేక నిరీక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో గత మూడు రోజులుగా కురిసిన వర్షంతో సోమవారం ఉదయం పెద్దవాగు నీటితో ప్రవహిస్తుంది.


పెద్దవాగులో ప్రవహిస్తున్న వరదనీరు

ఎన్నికల్లో బీసీలకు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలి

నవతెలంగాణ-మద్నూర్

ఎన్నికల్లో బీసీలకు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా అధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ ఎండి ముజీబ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బీజేపీ మండల అధ్యక్షులు తెప్పవార్ తుకారాం, మండల యూత్ నాయకులు సుధాకర్ పటేల్, కంచిన్వార్ యాద్రవ్, సక్కర్ల వార్ బాలకిషన్, వెంకట్ కాలే, అంజన్న ప్రవీణ్ దేశాయ్, సుభాష్, మాధవ్ పటేల్, బీజేపీ మండల నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

నవతెలంగాణ-మద్నూర్

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందింది. ఈ ఘటన మండలంలోని సలాబత్పూర్ గ్రామ శివారులో హైవే రోడ్డు పక్కన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. డోంగ్లి మండలంలోని మోగా గ్రామానికి చెందిన లక్ష్మణ్ గొండ (60) అనే వ్యక్తి జాతీయ రహదారి పక్కన అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉండటంతో మృతుని కుమారుడు అశోక్ గొండ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. శవానికి పంచనామా జరిపి పోస్టుమార్టం నిమిత్తం మద్నూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదులు నిల్

నవతెలంగాణ-పిట్లం

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఎలాంటి ఫిర్యాదులు అందలేదని స్థానిక తహసీల్దార్ వేణు గోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

24న దివ్యాంగులకు బసు పాసుల జారీ

- ఐకెపి ఏపిఎం కుంట గంగాధర్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో ఈనెల 24న బుధవారం దివ్యాంగులకు స్థానికంగా బస్ పాసులు ఆర్టీసీ ఆర్మూర్ డిపో మేనేజర్ సహకారంతో జారీ చేయడం జరుగుతుందని ఐకెపి ఎపిఎం కుంట గంగారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల దివ్యాంగులు వారి పాత బస్ పాస్, సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్, నాలుగు ఫోటోలు తీసుకొని కమ్మర్‌పల్లి ఐకెపి కార్యాలయానికి వస్తే స్థానికంగానే బస్సు పాసులు జారీ చేయడం జరుగుతుందని వెల్లడించారు. దివ్యాంగులు ఆర్మూర్ బస్సు డిపో వరకు వెళ్లి బస్సు పాసుల కోసం క్యూ లైన్ లో నిల్చుని అవస్థలు పడకుండా ప్రతి సంవత్సరం స్థానికంగా ఆర్టిసి డిపో మేనేజర్ సహకారంతో స్థానికంగానే ఐకెపి కార్యాలయంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. యువకులు, ప్ర జాప్రతినిధులు, రాజకీయ నాయకులు అర్హులైన దివ్యాంగులకు చేరవేసి వారిని ఐకెపి కార్యాలయానికి పంపి బస్ పాసులు సద్వినియోగం చేసుకొనేలా సహకరించాలని ఏపీఎం కుంట గంగాధర్ విజ్ఞప్తి చేశారు.

కల్యాణలక్ష్మీ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-భీంగల్



చెక్కులను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ మండల అధ్యక్షులు

మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నలుగురికి కల్యాణలక్ష్మీ, మెండోరాకు చెందిన ఒకరికి షాదీ ముబారక్ చెక్కులను తహసీల్దార్ శ్రీలత, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బొదిరే స్వామి సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు రేవంత్ రెడ్డి సర్కార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు అనంత్ రావు, గోపాల్ నాయక్, కిషన్, గంగాధర్, చిన్నయ్య, మల్లేష్, లింబాద్రి, సాయిలు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ (ఏ) లోకి మారుస్తామన్న హామీని నిలబెట్టుకోవాలి



కలెక్టరేట్‌వద్ద మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-మోర్తాడ్

బిసి (డి) నుండి బీసీ(ఏ)లోకి ముదిరాజ్ కులస్తులను మారుస్తామని ఎన్నికల మేనిఫెస్టో పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని బాల్కొండ నియోజకవర్గంలోని ముదిరాజ్‌లు కలెక్టర్‌కు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. గత ఎన్నికల్లో బీసీఏలోకి మారుస్తామని మేనిఫెస్టో పెట్టడం జరిగిందని, నేటి వరకు వారిని ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదని అన్నారు. ఉమ్మడి నిజామాబాద్. ఆదిలాబాద్ జిల్లాలో తప్ప ఇతర తెలంగాణ జిల్లాలలో అన్ని గ్రామాలలో మత్స్య సహకార సొసైటీలలో భాగస్వామ్యం కల్పించడం జరిగిందని అన్నారు. రెండు ఉమ్మడి జిల్లాల్లో మాత్రం ముదిరాజ్ కులస్తులకు మత్స్య సహకార సంఘం లో ఎలాంటి ప్రోత్సాహం లేకపోవడం వల్ల ఉపాధి కోల్పోతున్నామని అన్నారు. తక్షణమే రాష్ట్రప్రభుత్వం బీసీడీ నుండి బీసీలలోకి ముదిరాజ్ కులస్తులను కలుపుతూ వారికి రెండు జిల్లాలలో మత్స్య సహకార సంఘాల్లో కూడా ఉపాధి కల్పించాలని బాల్కొండ నియోజకవర్గ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు జక్కం అశోక్ వినతి పత్రంలో పేర్కొన్నారు. తమ డిమాండ్‌ను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించి తమకు న్యాయం చేసేలా కలెక్టర్ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బాల్కొండ నియోజకవర్గంలోని అన్ని మండలాల అధ్యక్షులు ముదిరాజ్ కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8 తరగతి నుండి పదవ తరగతి చదువుతున్న విద్యార్థినులకు వర్డ్ స్వచ్ఛంద సంస్థకు చెందిన మానిటరింగ్ కోఆర్డినేటర్ ఎస్. రాజు, కమ్యూనిటీ కోఆర్డినేటర్ లావణ్య కౌమార దశలో వచ్చే మార్పులు, గుడ్ టచ్, బ్యాడ్ ల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు రిలీవ్.. జాయినింగ్ కాపీలు అందజేత

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలం నుండి బదిలీపై వెళ్ళిన, మండలా నికి కొత్తగా వచ్చిన పంచాయితీ కార్యదర్శులకు రిలీవింగ్, జాయినింగ్ కాపీలను సోమవారం ఎం పీడీఓ వెంకటేశ్వర్లు అందించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ... తడపాకల్ జీపీకి చెం దిన శ్రీకాంత్, గుమ్మిర్యాల్ జీపీకి చెందిన భార్గవ్, దోంచంద జీపీకి చెందిన రాకేష్ బదిలీపై వెళ్ళారని, వారికి రిలీవ్ కాపీలను అందజేశామని అన్నారు. అలాగే బదిలీపై ఏర్గట్ల మండలానికి కొత్తగా వచ్చిన పంచాయతీ కార్యదర్శులు రామకృష్ణ, గణేష్, రాకేష్‌కు జాయినింగ్ కాపీలను అందజేశామని అన్నారు.

కేజీబీవీ డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

- పీడీఎస్‌యూ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ కేంద్రంలో ఉన్న కస్తూర్బా బాలికల వసతి గృహంలో సమస్యలు కుప్పలు తెప్పలుగా ఉన్నాయని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు ఎం. నరేందర్ అన్నారు. వీటిని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన వారు పరిష్కరించక పోవడానికి నిరసిస్తూ సోమవారం అధికారుల తీరుకు వ్యతిరేకంగా పిడిఎస్‌యూ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పట్టణ కేంద్రంలో కస్తూర్బా బాలికల వసతి గృహంలో 400నుంచి 500 మంది వరకు విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. వారికి ఎలాంటి ఆటంకం లేకుండా ఇక్కడ విద్యాధికారులు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. కానీ సంవత్సరాలు గడుస్తున్న ఎంత చెప్పినా సమస్యలు ఉన్నాయని తెలిపారు. గత వర్షాకాలంలోనూ విద్యార్థులు అవస్థలు పడితే మోడల్ స్కూల్ ముందు నీటి ప్రవాహం నదిలా ఉందని తెలియజేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. కస్తూర్బా కళాశాలలో అడవిని తలపించేలా చెట్లు, గడ్డి ఉందని తెలిపిన పట్టించుకోవడంలేదన్నారు. విద్యార్థులకు దోమలు, కీటకాలు, బ్యాక్టీరియా ద్వారా అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని చెప్పగా అధికారులు వచ్చి పోతున్నారు తప్ప సమస్య ఇప్పటివరకు పరిష్కారం కాలేదని తెలిపారు. ఆర్డీవో చొరవ తీసుకొని వెంటనే సమస్య పరిష్కారం అయ్యే విధంగా చూడాలని వారున్నారు. ఈ సమస్య దృష్టిలో ఉండి కూడా ఎందుకు పరిష్కరించడం లేదో చెప్పాలన్నారు. ఈ రెండు మూడు రోజుల్లో ఈ సమస్య పరిష్కారం కాకపోతే మాత్రం విద్యార్థులతో ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏరియా ప్రధాన కార్యదర్శి డి.నిఖిల్ నాయకురాలు జంపన్న భార్గవ్ నితిన్ అఖిల్ శ్రీకాంత్ ముఖేష్ రాజ శివ గంగా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం



నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు ప్రధానోపాధ్యాయురాలు కమల సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాలువా పుష్ప గుచ్ఛంతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు గంగాకిషన్, శశికాంత్, చంద్రకాంత్, రాకేష్, ఫయాజ్, రాజేందర్ మాట్లాడుతూ.. గత కొన్ని సంవత్సరాలుగా ఈ పాఠశాలలో విధులు నిర్వహించి విద్యార్థులను వదిలి ఇతర పాఠశాలకు వెళ్లినందుకు కొంత బాధ కలిగుతోందని, బదిలీల్లో భాగంగా తప్పక వెళ్లాల్సిందేనని తెలిపారు.

మాజీ ఎంఎంపి సేవలు మరువలేనివి..

మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ పాఠశాల నూతన బిల్డింగ్ కొరకు ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి చేసిన కృషి వల్లనే నూతన బిల్డింగ్ ఏర్పాటు అయ్యిందని, విద్యార్థుల కోసం ఏది అడిగినా కాదనకుండా ఆయన వంతుగా కృషి చేశారని వారు కొనియాడారు. ఇంత పెద్ద మొత్తంలో పాఠశాల నూతన బిల్డింగ్ నిర్మాణం చేయడం చాలా సంతోషంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులు నృత్యాలు చేసి అలరించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కమల, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్క వృక్షమయ్యే వరకు కాపాడుకుందాం

- రాబోవు తరానికి కానుక ఇద్దాం
- రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నేడు నాటిన మొక్క వృక్షమయ్యే వరకు కాపాడుకుందామని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. సోమవారం ఇందల్‌వాయి ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని లోలం, అమ్రాద్ పల్లి, యెల్ల రెడ్డి పల్లి గ్రామాల శివారులో ఉన్న అటవీ భూముల్లో వనమహోత్సవంలో భాగంగా మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఒకప్పుడు కలకలలాడే అడవులు నేడు కనుమరుగయ్యాయని దీనిని కాపాడడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అటవీ భూములు ఆక్రమాలకు గురికాకుండా చూడాలని సూచించారు. చెట్లతోనే వర్ష భావం సమతుల్యత ఆధారపడి ఉంటుందని గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఐదుసార్లు హరితహారం కార్యక్రమం పెట్టి మొక్కలు నాటిన అ మొక్కల అన్నవాళ్లు ఏమన్నారు. దీంతో హరితహారం ఫలితం అందరి ద్రాక్షగా మిగిలిందన్నారు. 28శాతం కంటే ఎక్కువ అడవి ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. మనమహోత్సవంలో భాగంగా రేంజ్ పరిధిలో 100 ఎకరాలకుపైగా వివిధ రకాల మొక్కలను నాటడం జరుగుతుందని, ఇదే కాకుండా దీన్ని సంరక్షించే విధంగా అటవీ అధికారులు కృషి చేయడం జరుగుతుందన్నారు.



మొక్కలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

రుణమాఫీ సాహసోపేత నిర్ణయం..

ఎన్నికల సమయంలో టీపిసిసి అధ్యక్షులు, ముఖ్య మంత్రి దేశంలోని 29 రాష్ట్రాల్లో రైతు రుణమాఫీ చేసిన దాఖలాలు లేవని రూ.32 వేల కోట్లు భారంపడ్డ రైతుల కోసం, ఎవ్వరు చెయ్యని సాహసం కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది. ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసి రైతులకు రుణ విముక్తి చేశమన్నారు. లక్షలు రాని రైతులు ఎలాంటి ఆందోళన గురికాకుండా ఉండాలని వ్యవసాయ విస్తరణ అధికారులకు ఇప్పటికీ ఆదేశాలను జారీ చేశామని, రైతు వేదికల్లో విస్తరణాధికా రుల వద్దకు వెళ్లి రుణానికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకోవచ్చని తెలిపారు. ఇందల్‌వాయి ఫారెస్ట్ రేంజ్ అధికారి రవి మోహన్ బట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను తిలకించి రేంజ్ పరిధిలో ఉన్న వివరాల ను ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలల అధ్యక్షులు మోత్కురి నవీన్‌గౌడ్, అమృత పూర్ గంగాధర్, రూరల్ అధ్యక్షులు సంతోష్ రెడ్డి, ఎల్ఐసి గంగాధర్, మాజీ ఎంపిటిసి చింతల కిషన్, బోర్ వేల్ రాజేందర్ రెడ్డి, సొసైటి చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, కర్ర మోహన్, ఆశిష్, మాజీ ఎంపీపీ నర్సయ్య, డిసిసి డెలిగేట్ సుధాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తహసీల్దార్ వెంకట్రావు, ఎంపీడీవో అనంతరావు, ఎంపీఓ రాజ్ కాంత్ రావు, ఆర్ఐ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

1నుండి 3 వరకు అంగన్వాడీలకు

ఇవ్వాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

- డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.శంతన్

నవతెలంగాణ-ఆర్మూర్

1నుండి 3వ తరగతి వరకు అంగన్వాడీలకు ఇవ్వాలని నిర్ణయం ఉప సవరించుకోవాలని డీటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. శంతన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లోని 1 నుండి 3వ తరగతి వరకు ప్లేవే పద్దతిలో బోధించడానికి, ఆ తరగతుల నిర్వహణ అంగన్వాడీ కేంద్రాలకు ఇవ్వాలని ముఖ్యమంత్రి ప్రకటించడం వల్ల ప్రాథమిక విద్య మొత్తంగా నిర్వీర్యమయ్యే పరిస్థితులు నెలకొంటాయని, ఆ నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. ప్రాథమిక పాఠశాలల్లోని 1నుండి 3 వ తరగతులను అంగన్వాడీలకు ఇవ్వడం ద్వారా ప్రాథమిక విద్య పూర్తిగా ప్రయివేటు పరమయ్యే అవకాశాలు ఉంటాయని, కావున అంగన్వాడీలనే ప్రాథమిక పాఠశాలల్లో కలుపుతూ అన్ని ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్యను ప్రవేశపెట్టాలని తెలిపారు. అదేవిధంగా ప్రతి ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయ పోస్టులు(ఎల్ఎఫ్ఎల్) మంజూరు చేసి డీఈడీ, బీఈడీ అర్హతలు గల సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు అందరికీ ప్రమోషన్‌కు అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన పదోన్నతుల్లో మిగిలిపోయిన పోస్టులకు వెంటనే ప్రమోషన్, కౌన్సిలింగ్ చేపట్టాలని, ఇటీవల బదిలీ అయిన ఎస్‌జిటిలు అందరిని సబ్‌స్టిట్యూట్ లింకు పెట్టకుండా విడుదల చేయాలని పేర్కొన్నారు. నూతన ఉపాధ్యాయులు వచ్చే వరకు విద్యా వాలంటీర్లను నియమించాలని, గతంలో మాదిరిగా ప్రతినెల ప్రమోషన్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. పిఆర్‌సి గడువు ముగిసి సంవత్సరం దాటినందున 01.07.2023 నుండి వెంటనే అమలుకు ఉత్తర్వులు విడుదల చేయాలని పేర్కొన్నారు. పెండింగ్ లో ఉన్న నాలుగు డిఎలు విడుదల చేయాలని, ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన విధంగా ప్రతి పాఠశాలకు స్వచ్ఛ కార్మికులను వెంటనే నియమించాలని తెలిపారు. పాఠశాలల కరెంటు బిల్లులు ప్రభుత్వమే చెల్లించాలని, పాఠశాలలు ప్రారంభమై ఐదు వారాలు దాటినప్పటికీ విద్యార్థులందరికీ సరిపడా పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో అందజేయలేదని పేర్కొన్నారు. పాఠశాలల్లో అకాడమిక్ పర్యవేక్షణ కొరకు పర్యవేక్షణ అధికారుల పోస్టులు సృష్టించి మండలానికి ఒకటి భర్తీ చేయాలని కోరారు.

సిలిండర్ లీక్..తప్పిన ప్రమాదం

- కుటుంబీకులకు అస్వస్థత

నవతెలంగాణ-భీంగల్‌రూరల్

మండలంలోని జాగిర్యాల గ్రామంలో సోమవారం ఉదయం ఓ ఇంట్లో సిలిండర్ లీక్ అయింది. ఇంట్లో రెండు గ్యాస్ సిలిండర్ బుడ్డిలో ఉండడంవల్ల ఇంటి యజమానులు ఒక బుడ్డిని వాడుతూ ఇంకో గ్యాస్ సిలిండర్ నిల్వ ఉంచుకున్నారు. ఆ నిల్వ ఉంచిన బుడ్డి ఒక్కసారిగా గ్యాస్ బుడ్డి కింది భాగం నుండి లీక్ కావడంతో కుటుంబీకులు భయాందోళనకు గురయ్యారు. గ్యాస్ లీకేజీని కనిపెట్టిన కుటుంబీకులు ఇంట్లో నుండి బయటకి వచ్చి గ్యాస్ బ్రాంచ్‌కు ఫోన్ చేశారు. వారు అందుబాటులో లేకపోవడంతో స్థానికులు భయంతో దూరంగా వెళ్లారని సమాచారం. భారత్ గ్యాస్‌బ్రాంచ్ మేనేజర్ నిర్లక్ష్యంగా మాట్లాడారని తెలిపారు. ఇకనైనా భారత్ గ్యాస్ డీలర్లు జాగ్రత్తలు తీసుకోవాలని గ్యాస్ కస్టమర్లు కోరారు.

బిఎడ్ సెమిస్టర్స్, బ్యాక్‌లాగ్ పరీక్షల ఫీజు తేదీప్రకటన

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో బిఎడ్ నాల్గవ సెమిస్టరు రెగ్యూలర్, ఒకటవ, రెండవ, మూడవ నాలుగవ సెమిస్టర్ బ్యాక్ లాగ్ పరీక్షల ఫీజు 01-08-2024 తేది లోపు చెల్లించాలని 100 రూపాయల అపరాధ రుసుంతో 02-8-2024 వరకు చెల్లించ వచ్చని పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్.ఎం. అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలు విశ్వవిద్యాలయ వెబ్ సైట్‌లో పొందుపరచడం జరిగిందని పేర్కొన్నారు.

పీజీ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్ లాగ్ పరీక్షల ఫీజు తేదీ ప్రకటన..

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో పీజీ ఎంఏ, ఎంసీఏ, ఎంకాం, ఎమ్మెస్‌డబ్ల్యూ, ఎల్ఎల్‌బి, ఎల్ఎల్‌ఎమ్, ఏపీఈ, ఐఎంబిఏ, ఐపిసి హెచ్, ఎంబీఏ, ఎంసీఏ, ఐఎంబిఏ, రెండవ, ఎనిమిదవ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్ లాగ్ పరీక్షల ఫీజు 05-08-2024 తేది లోపు చెల్లించాలని 100 రూపాయల అపరాధ రుసుంతో 08-08-2024 వరకు చెల్లించ వచ్చునని పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య.ఎం. అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలు విశ్వవిద్యాలయ వెబ్ సైట్ లో పొందుపరచడం జరిగిందని తెలిపారు.

జగన్నాయకునికి ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-భీంగల్

మండలంలోని పిప్రి గ్రామ శివారులోని అడవిలోని కొండల్లో వెలసిన జగన్నాయకునికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి యేటా వర్షాకాలంలో గుహలో వెలసిన జగన్నాయకునికి ప్రత్యేక పూజలు చేయడం ఆనాయితీగా వస్తోంది. అందులో భాగంగా ఈ ఏడు కూడ జగన్నాయకునికి గ్రామ కమిటీ కార్యవర్గం గుర్జకింది లింబన్న, లొక్కిడి అశోక్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గుహ ముందర ఉన్న హనుమాన్ విగ్రహానికి పూజలు నిర్వహించారు. అనంతరం గుహలో కొలువైన జగన్నాయకుడికి పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తదుపరి కొండ పరిసర ప్రాంతాల్లో వన భోజనాలు గ్రామస్తులు ఏర్పాటు చేసుకుని సంతోషంగా కుటుంబ సభ్యులతో గడిపారు.

డిగ్రీ వన్ టైమ్ ఛాన్స్ బ్యాక్‌లాగ్ సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ అనుబంధ కళాశాలల పరిధిలోని వన్ టైం ఛాన్స్ (సిబిసిఎస్) బిఎ, బీకాం, బీఎస్సీ, బిబిఏ కోర్సులకు ఐదవ, ఆరవ సెమిస్టర్ బ్యాక్లాగ్ పరీక్షలు 20వ రోజు ప్రశాంతంగా జరిగాయి. గిరిరాజ్ గవర్నమెంట్ కాలేజ్ నిజామాబాద్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కామారెడ్డి, ఎస్ఆర్ఎన్‌కె గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ బాన్సువాడ, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఆర్మూర్‌లో జరిగిన పరీక్షకు ఉదయం(ముగ్గురు) విద్యార్థులకు ముగ్గురు హాజరయ్యారని తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 22 మంది విద్యార్థులకు 21 విద్యార్థులు హాజరయ్యారని 01 ఒక్కరు గైరాజరయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు.

ఇంటిగ్రేటెడ్ పీజీ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్ లాగ్ పరీక్షలు ప్రశాంతం

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో పీజీ ఏపీఈ, ఐపిసిహెచ్, ఐఎంబిఏ, ఆరవ, ఎనిమిదవ, పదవ, ఎల్ఎల్‌బి, ఆరవ, ఎంబీఏ, ఎంసీఏ, ఒకటవ, మూడవ ఐఎంబిఏ, ఏడవ తొమ్మిదవ సెమిస్టర్, రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు 06వ రోజు ప్రశాంతంగా జరిగాయి. తెలంగాణా యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, న్యాయ కళాశాల లో జరిగిన పరీక్షకు ఉదయం 14 మంది విద్యార్థులకు 14 మంది విద్యార్థులు హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 89 మంది విద్యార్థులకు 76 మంది విద్యార్థులు హాజరయ్యారని 13 మంది విద్యార్థులు గైరాజరయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.

పీజీ ఇంటిగ్రేటెడ్ కోర్సెస్ బ్యాక్ లాగ్ పరీక్షల టైం టేబుల్ విడుదల..

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని పీజీ మరియు ఇంటిగ్రేటెడ్ కోర్సెస్ బ్యాక్ లాగ్ పరీక్షల టైం టేబుల్ విడుదల చేయడం జరిగింది ఎంఏ, ఎంకాం, ఎంఎస్‌డబ్ల్యూ, ఎమ్మెల్సీ, ఎల్ఎల్‌బి, ఎల్ఎల్ఎం, ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కోర్స్ (ఏపీఈ, ఐపిసిహెచ్, ఐఎంబి ఏ, ఒకటవ, మూడవ, నాలుగవ, ఏడవ, తొమ్మిదవ సెమిస్టర్ బ్యాక్ లాగ్ పరీక్షలు 31 జులై నుండి ప్రారంభమై 14 ఆగస్టు వరకు కొనసాగుతాయని పూర్తి వివరాల http//www.telanganauiversitt.ac.in వెబ్సైట్లో పొందుపరచడం జరిగిందని పరీక్షల నియంత్రణ అధికారిని ప్రొఫెసర్ యం.అరుణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

బీసీల డిక్లరేషన్ హామీలను అమలు చేయాలి

నవతెలంగాణ-సిరికొండ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కామారెడ్డి ఎన్నికల సభలో 8 అంశాలపై బీసీ డిక్లరేషన్ ద్వారా తెలంగాణ రాష్ట్రంలోని బీసీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తహసీల్దార్ కార్యాలయంలోని తహసిల్దార్ రవీందర్‌రావుకు బిజెపి పార్టీ మండల నాయకుల ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ.. ప్రభుత్వంలోకి వచ్చిన ఆరు నెలల్లోపే కులగణన చేసి బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా బీసీలకు రిజర్వేషన్లు పెంచుతామన్నారు. స్థానిక సంస్థల్లో ప్రస్తుతం ఉన్న బీసీ రిజర్వేషన్లు 23 శాతం నుండి 42 శాతానికి పెంచుతామని హామీ ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వ సివిల్ కన్స్ట్రక్షన్స్, మెయింటెనెన్స్ కాంట్రాక్టుల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామన్నారు. అలాగే గొల్ల కురుమలకు అధికారంలో వచ్చిన 100 రోజుల్లోనే రెండవ దశ గొర్రెల పంపిణీకి సంబంధించి రెండు లక్షల రూపాయలు లబ్ధిదారుని ఎకౌంట్లో వేస్తామన్న హామీ మరిచి గొల్ల కురుమలను మోసం చేశారని అన్నారు. బీసీ సబ్ ప్లాన్‌కు తగిన నిధులు మంజూరు చేసేందుకు మొదటి అసెంబ్లీ సెషన్‌లోనే చట్టబద్ధమైన హోదాతో జ్యోతిరావు పూలే బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటుచేసి ఏడాదికి 20వేల కోట్ల రూపాయల చొప్పున ఐదేళ్లలో లక్ష కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చి 8 నెలలు గడుస్తున్న నిధుల విషయంపైన ఎటువంటి చర్యలు తీసుకోలేదని, ఎంబీసీ కులాలకు ప్రత్యేక సంక్షేమ మంత్రిత్వ శాఖ ఏర్పాటు ఏమైందని తెలిపారు. అన్ని బీసీ కులాల సమగ్ర అభివృద్ధికి కార్పొరేషన్లు ఏర్పాటు చేసి బీసీ యువతకు చిరు వ్యాపారాలు నిర్వహించుకునేందుకు ఉన్నత విద్య కోసం వడ్డీ లేకుండా, పది లక్షల రుణాలు ఇస్తామని హామీ ఇచ్చి మరిచిపోయారని అన్నారు. బీసీ కుటుంబాల యువతకు ర్యాంకుతో సంబంధం లేకుండా మొత్తం ఫీజు రియంబర్స్మెంట్ ఆరు నెలల్లోగా ఇస్తామని ఇవ్వకుండా బీసీ యువతను ఉద్యోగాలకు అర్హత లేకుండా చేస్తున్నారని అన్నారు. సమయం గడుస్తున్నప్పటికీ రాష్ట్రంలో ఉన్న మత్స్య సంఘాలకు చేప పిల్లల పంపిణీ చేయకుండా, బిడ్లు ఆహ్వానించి 100 కోట్ల రూపాయల వరకు అవినీతికి తెర లేపినట్టుగా అర్థమవుతుందని అన్నారు. ముదిరాజ్, గంగపుత్రులకు మున్నూరు కాపు, పద్మశాలి, విశ్వకర్మ రజక సామాజిక వర్గాలకు ఇచ్చిన హామీలన్నీ కూడా నెరవేర్చేందుకు ఎటువంటి చర్యలు గాని, కనీసం క్యాబినెట్లో నిర్ణయాలు గాని తీసుకోలేదని అన్నారు. బీసీలకు ఇచ్చిన హామీలకు నిరసనగా భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో నిరసన తెలియజేస్తూ తద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకురావడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వం వెంటనే హామీలపైన చర్యలు ప్రారంభించకపోతే లక్షల మంది బీసీలతో అన్ని కలెక్టరేట్లలో ధర్నాలు నిరసనలు దీక్షలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాజేశ్వర్ రెడ్డి, రామస్వామి, కనగందుల గోపి, కిషన్, బాబురావు, శంకర్, మహేందర్, నవీన్, అజయ్, మారుతి, సురునిడ గోపి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

నవతెలంగాణ-భిక్కనూర్

కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ పేరిట రైతులను మోసం చేస్తుందని సొసైటీ చైర్మన్‌లు తెలిపారు. సోమవారం భిక్కనూర్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఏకకాలంలో రెండులక్షల రూపాయల రుణమాఫీ చేస్తానని చెప్పి లక్షలోపు ఉన్నవారికి కూడా పూర్తిస్థాయిలో రుణామాఫీ చేయకపోవడం సిగ్గుచేటని అన్నారు. కామారెడ్డి నియోజకవర్గంలో 13 సొసైటీ పరిధిలో 13,972 మంది రైతులు సొసైటీలలో రెండులక్షల రూపాయలలోపు రుణాలు తీసుకుంటే కేవలం 2974 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ చేశారని మిగతా 10,998 మంది రైతులకు రుణమాఫీ చేయకుండా పూర్తిస్థాయిలో రుణమాఫీ చేసినట్లు సంబరాలు చేసుకోవడం ఎందుకని ప్రశ్నించారు. వైయస్ రాజశేఖర్‌రెడ్డి, కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఏకకాలంలో రుణమాఫీ చేసిన ఘనత ఉందని, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పూర్తిస్థాయిలో రుణ మాఫీ చేసినట్లు సంబరాలు చేసుకొని ఇటు రాష్ట్ర ప్రజలను అటు కాంగ్రెస్ పార్టీ అధిష్టానాన్ని మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఇచ్చిన మాట ప్రకారం రైతులను మోసం చేయకుండా ఏకకాలంలో రుణమాఫీ చేయాలని సూచించారు. రుణమాఫీ విషయంలో కేవలం 10/20 శాతం మాత్రమే రైతులకు రుణమాఫీ జరిగిందని తెలిపారు. జిల్లా, మండల, బ్యాంకు అధికారులను ఎవరిని అడిగినా తమకేమీ తెలియదు అన్నట్లు మాట్లాడుతున్నారని రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రణాళిక లేకుండా తమ ఇష్టానుసారంగా కొంతమందికి మాత్రమే రుణమాఫీ చేసి గొప్పలు చెప్పుకోవడం సరికాదన్నారు. పూర్తిస్థాయిలో రుణమాఫీ చేస్తే రైతులే సంబరాలు చేసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజంపేట సొసైటీ చైర్మన్ అశోక్, రామేశ్వర్‌పల్లి సొసైటీ చైర్మన్ భూమిరెడ్డి, అంతంపల్లి సొసైటీ చైర్మన్ వెంకటొరెడ్డి, తిప్పాపూర్ సొసైటీ చైర్మన్ వెంకటొరెడ్డి, ముత్యంపేట్ సొసైటీ చైర్మన్ తిరుపతి గౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్‌లు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
మంగళవారం | జులై 23, 2024 | www.navatelangana.com

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల రైతులు రైతుబీమా కోరకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యాసాయాధికారి రాజ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో ఇటీవల కొత్తగా పాసుబుక్ పొందిన వారు 'రైతుభీమా' కోరకు వచ్చే నెల ఆగష్టు 5వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా మండల వ్యవసాయాధికారి రాజ్‌కుమార్ తెలిపారు. ఇది వరకే 'రైతుభీమా'లో నమోదై ఉండి వారి నామినీ చనిపోయినట్లయితే నామినీ పేరును మార్చుకోవడానికి జులై 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే రైతులు అప్లికేషన్ ఫారం, రైతు పట్టాదార్ పాసుబుక్, ఆధార్ కార్డు, నామినీ ఆధార్‌కార్డు జిరాక్స్ లను తీసుకొని ఆయా గ్రామాల రైతులు అందుబాటులో ఉన్న ఏఈవోల వద్ద సరిచేసుకోని దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

ర్యాంక్ సాధించిన విద్యార్థినికి అభినందన

నవతెలంగాణ-ధర్పల్లి


విద్యార్థినికి స్వీట్ తినిపిస్తున్న అధ్యాపకులు

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివి ఎంసెట్లో ర్యాంక్ సాధించి సిఎమ్ఆర్‌జి ఇంజనీరింగ్ కాలేజీలో సీటు పొందిన కుమారి లావణ్య ఎంపీసీ సెకండియర్ విద్యార్థినికి కళాశాలలో అధ్యాపక బృందం సోమవారం స్వీట్ తినిపించి అభినందనలు తెలిపారు. ఉన్నత చదువులు చదివి మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించి తల్లి తండ్రుల పేరు, తమ కళాశాల పేరు నిలబెట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రజియోద్దీన్ అస్లాం, అధ్యాపక బృందం, పాల్గొన్నారు.

రైతాంగ ఉద్యమ కమిటీకి ఇచ్చిన

హామీలు అమలు చేయాలి

- **ఎంపీ పీఏకు ఎస్‌కేఎం వినతి**

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రైతాంగ ఉద్యమ కమిటీకి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలు అమలుకోసం పార్లమెంట్లో చర్చించాలని ఎస్‌కేయం నాయకులు డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో బిజెపి 2014లో తమ ఎన్నికల ప్రణాళికలోనూ, 2019 ఎన్నికల్లోను రైతాంగాన్ని రెండింతల ధనవంతులను చేస్తానని, స్వామినాథన్ కమిషన్ సిఫారసుల అమలు చేస్తానని, హామీ ఇవ్వడమే కాకుండా ఎన్నికల ప్రణాళికలో కూడా పేర్కొని రైతులకు మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంట్ సభ్యులు. డి.అరవింద్‌ను కలిసేందుకు రెండు రోజులుగా ప్రయత్నించిన అందుబాటులో లేకపోవడంతో సోమవారం ఆయన క్యాంపు కార్యాలయంలో పిఏ నారాయణకు వినతిపత్రం అందించామని వి. ప్రభాకర్, వేల్పూర్ భూమయ్య తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంఎస్పి గ్యారెంటీ చట్టం చేస్తానని.. స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేస్తానని.. రైతులపై పెట్టిన కేసులన్నీటిని రద్దు చేస్తానని.. ఢిల్లీ కేంద్రంగా సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వంలో జరిగిన ఉద్యమంలో దాదాపు 756 మంది ప్రాణాలు వదిలారని, ఆ కుటుంబాలన్నీటినీ ఆదుకుంటామని రాతపూర్వకంగా హామీ ఇచ్చి ఉద్యమాన్ని తాత్కాలికంగా విరివింప చేసిన మోడీ దేశ రైతాంగాన్ని మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ, సమగ్ర రుణమాఫీ వెంటనే చేయాలని, విద్యుత్ సవరణ బిల్లు ఉపసర్హించుకోవాలని తదితర డిమాండ్లతో జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో పెట్టి చర్చించి, ఆమోదింప చేసుకోవడానికి దేశవ్యాప్తంగా పార్లమెంటు సభ్యులకు విజ్ఞాపన పత్రాలు ఇచ్చి విజ్ఞప్తి చేయడం జరుగుతుందని వారు తెలిపారు. బిజెపి రైతు వ్యతిరేక విధానాలతో రైతులు ప్రతిరోజు సంఘటన 31 మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారని మోడీ, షాలకు కనిపించడం లేదా.. అని ప్రశ్నించారు. కార్యక్రమంలో పి వెంకటేష్. బి దేవారం. పెద్ది వెంకట్ రాములు. గంగాధరప్ప, గుమ్ముల గంగాధర్. సాయిలు పాల్గొన్నారు.



ఎంపీ పీఏకు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘాల నాయకులు

పసుపు లారీ చోరీ నిందితుడి అరెస్ట్

- **30 లక్షల పసుపు, 40 లక్షల లారీ స్వాధీనం**

నవతెలంగాణ-కంఠేశ్వర్

పసుపు లారీ దొంగతనం చేసిన నిందితుడు నగరంలోని సుభాష్ నగర్ కు చెందిన షేక్ తోఫిక్ అలీని అరెస్టు చేసి 30 లక్షల పసుపును 40 లక్షల లారీని స్వాధీనం చేసుకున్నట్లు ఒకటవ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ ఓ విజయ్ బాబు సోమవారం తెలిపారు. ఎస్‌హెచ్‌ఓ విజయబాబు తెలిపిన వివరాల ప్రకారం.. పసుపులోడు లారీ దొంగతనం కేసులో రిసీవర్స్ కొరకు గాలింపు చర్యలు చేపట్టామని అన్నారు. లారీ దొంగతనం పసుపును స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్ బాబు తెలిపారు.

ప్రజావాణికి 91 ఫిర్యాదులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 91 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్, అదనపు కలెక్టర్ అంకిత్ కిరణ్‌కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.మకరంద్, ట్రైనీ కలెక్టర్ సంకేత్, డీఆర్డీఓ సాయాగౌడ్‌లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాయల చంద్రశేఖర్ ఆశయ సాధన కోసం పునరంకితమౌదాం

- **సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా)**

నవతెలంగాణ-ధర్పల్లి

అమరుడు, విప్లవ యోధుడు రాయల చంద్రశేఖర్ ఆశయ సాధన కోసం పునరంకితమౌదామని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి ఆర్.రమేష్ అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) కేంద్ర నాయకులు, రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు రాయల చంద్రశేఖర్ సంస్మరణ సభను సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) ధర్పల్లి, సిరికొండ మండలాల సంయుక్త కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. సంస్మరణ సభలో రాయల చంద్రశేఖర్ చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. పిడిఎస్‌యులో ఎన్నో ఉద్యమాలు నిర్వహించారని, 1975లో ఎమర్జెన్సీ కాలంలో రహస్య జీవితం గడిపారని అన్నారు. పోడు భూముల కోసం పోరాటాలు చేశాడని ఆయన పేర్కొన్నారు. ఆయన నమ్మిన సిద్ధాంతం కోసం ఆశయాల కోసం ప్రజలు, కార్యకర్తలు పని చేయాలని ఆయన పిలుపు ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) ఆర్మూర్ డివిజన్ నాయకులు ఆర్.దామోదర్, బి.బాబన్న, జీ.సాయరెడ్డి, మండల నాయకులు ఎం.లింబాద్రి, ఈ.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ ఓబిసి ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వం బీసీ డిక్లరేషన్ హామీని నెరవేర్చాలని ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు యామాద్రి భాస్కర్, పట్టణ అధ్యక్షుడు రాజ్ కుమార్‌లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు జెస్సు అనిల్ కుమార్, పెర్కిట్ దుగ్గి విజయ్, చిన్నారెడ్డి పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం


పాలాభిషేకం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-ముప్కాల్

రైతు రుణమాఫీ రూ.లక్ష రూపాయలలోపు నేరుగా రైతుల ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం జమ చేయడం ద్వారా కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు ముస్కు మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని 'హనుమాన్ గల్లీ' కాలనీలో లబ్ధిదారులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి సోమవారం పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్కొండ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి ముత్యాల సునీల్ కుమార్‌రెడ్డికి లబ్ధిదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏలేటి రాములు, లోక సుభాష్, ప్రశాంత్, మల్లారెడ్డి, కట్ట గోపి, సదా, కట్ట సాయన్న, లబ్ధిదారులు, కాలనీ వాసులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు..

పోలీస్ కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుల్‌గా ప్రమోషన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్‌లో నలుగురు పోలీస్ కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుల్స్ గా ప్రమోషన్స్ పొందిన వారిని పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ అభినందించారు. నిజామాబాద్ పోలీస్ కమీషనరేటు పరిధిలోని కానిస్టేబుల్ నుండి హెడ్ కానిస్టేబుళ్లుగా నలుగురు ప్రమోషన్ పొంది సోమవారం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగెనవర్, ఐపిఎస్‌కు పుష్పగుచ్చాలు ఇచ్చి మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రమోషన్ పొందిన హెడ్ కానిస్టేబుల్స్ కు పోలీస్ కమిషనర్ శుభాకాంక్షలు తెలియజేశారు. బి. కిషన్- వన్ టౌన్ పోలీస్ స్టేషన్, సి.అజయ్ కుమార్-వన్‌టౌన్ పోలీస్ స్టేషన్, బి.సురేష్-మోర్తాడ్ పోలీస్ స్టేషన్, ఎస్.రవికాంత్, సిఎస్‌బి, పదోన్నతి పొందారని తెలిపారు.

తాటిపత్రలు పంపిణీ

నవతెలంగాణ-భీమ్‌గల్ రూరల్

గత రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండలంలోని దేవన్‌పల్లి,(తాళ్లకుంట)లో గుడిసెలలో నివసిస్తున్న పేద కుటుంబాలకు నిజాంబాద్ జిల్లా ఎన్ఎస్‌యుఐ జిల్లా ఉపాధ్యక్షుడు సయ్యద్ రెహమాన్, ఎన్ఎస్‌యుఐ బాల్కొండ నియోజకవర్గ జనరల్ సెక్రెటరీ మొండి దినేష్ ఆధ్వర్యంలో పేద కుటుంబాలకు తాటిపత్రలు పంపిణీ సోమావారం చేశారు. మా పేదలను గుర్తించి ఇలాంటి సహాయం చేసిన యువకులకు గ్రామస్తులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ యువకులు కార్తీక్, రేశ్వంత్, రిషి, రహీల్, అరవింద్, హర్షిత్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ చెక్కులు పంపిణీ


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం పరిధిలోని లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజురైన ఆర్థిక సహాయాన్ని(చెక్కులు) అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 44మంది లబ్ధిదారులకు సోమవారం పంపిణీ చేశారు. అనంతరం ధన్‌పాల్ మాట్లాడుతూ.. తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత తన కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్న వారిలో 44 మందికి, రూ.11లక్షల 94వేలు విడతలుగా చెక్కులు వచ్చాయన్నారు. ఎలాంటి పైరవీలు లేకుండా దరఖాస్తు చేసుకునే వారు నేరుగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అన్ని పత్రాలు అందజేస్తే సాధ్యమైనంత వరకు ప్రభుత్వం నుంచి, ముఖ్య మంత్రి సహాయనిధి సాయం అందేలా తనవంతు ప్రయత్నం చేస్తానన్నారు. లబ్దిదారులకు అప్లై చేసుకున్న మొత్తంలో 50శాతం విడుదల చేయాలనీ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

సహారా ఇండియా డబ్బులు ఇప్పించండి

- **ఎమ్మెల్యే ను కలిసిన బాధితులు**

నవతెలంగాణ-ఆర్మూర్


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

సహారా ఇండియా డబ్బులు ఇప్పించాలని ఎల్ఐసి ఆర్మూర్ బ్రాంచ్ అధ్యక్షులు బాలయ్య సోమవారం ఎమ్మెల్యే రాకేష్ రెడ్డిని కలిసి కోరారు. దేశంలో 12 కోట్ల మంది పెద, మధ్య తరగతి ప్రజలు సహారా ఇండియా కంపని సంస్థలో పొదుపు చేసుకున్న 86 వేల కోట్ల డబ్బుల్ని తిరిగి చెల్లించకుండా సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వం కాలయాపన చేస్తుందని అన్నారు. కనుక కేంద్ర ప్రభుత్వం సహారా ఇండియా బాధితులకు వెంటనే డబ్బులు చెల్లించి ఆదుకోవాలని ఆయన కోరారు. వివిధ అవసరాల కోసం, పొదుపు చేసుకున్న డబ్బును సహారా బ్యాంకుల్లో పొదుపు చేసుకుంటే కంపెనీతో కుమ్మక్కై కేంద్ర ప్రభుత్వం ప్రజల డబ్బుతో కోట్లాది ప్రజల జీవితాలతో చెలగాటమాడు తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల చదువులకు డబ్బులు లేక పిల్లల చదువులు మధ్యలోనే ఆగి పోతున్నాయని అన్నారు. సుప్రీంకోర్టు ఖాతాదారుల డబ్బులు చెల్లించాలని 2023లో ఆదేశాలు జారీ చేసిన కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం శోచనీయమని, ఆన్లైన్ ద్వారా చెల్లిస్తామని పోర్టల్ ప్రారంభించిన కేంద్ర మంత్రి అమిత్ షా ఈరోజు నాటికి 86 వేల కోట్ల కేవలం 500 కోట్లు మాత్రమే చెల్లించినారని అన్నారు. దీనికే సంవత్సరంన్న రకాలం పడితే 86 వేల కోట్ల రూపాయలు చెల్లించడానికి ఇంకెన్ని దశాబ్దాలు పడుతుందని ఆయన ప్రశ్నిస్తున్నారు. 12 కోట్ల మంది ఖాతాదారుల కుటుంబంతో పది లక్షల మంది ఏజెంట్ల జీవితాలను బజారు కీడ్చడం సరికాదని ఆయన అన్నారు . పార్లమెంటు ఎన్నికల సభల్లో సహారా ఖాతాదారులకు డబ్బులు చెల్లిస్తామని హామీ ఇచ్చిన అమిత్‌షా ఇప్పుడు ఆ మాట మాట్లాడలేక పోవడం విచారకరమని అని ఆయన అన్నారు. సహారా కంపెనీతో అమిత్ షా కుమారుడు, బిజెపి పార్టీ నాయకులకు ఆర్థిక సంబంధాలు ఉండడం మూలంగానే ప్రజలకు డబ్బులు చెల్లించడంలో కేంద్ర ప్రభుత్వం కాలయాపన చేస్తుందని అనుమానం వస్తుందని ఆయన తెలిపారు. డబ్బుల్ని పోర్టల్ ఆన్లైన్ ద్వారా కాకుండా నేషనల్ బ్యాంకు ద్వారా చెల్లించి ఆదుకోవాలని ఆయన కోరారు. ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి మీ సమస్య పరిష్కారం కోసం నా వంతు కృషి చేస్తానని మాట ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో నారాగౌడ్, నరసయ్య, నరేందర్, శేఖర్, పురుషోత్తం, గోపి, రమేష్, సాయికుమార్, భూమేశ్వర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధనకోసం..

ఛలో ఢిల్లీకి తరలిరావాలి

- **ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు బిఎన్ రమేష్ కుమార్ పిలుపు**
- **కరపత్రాల ఆవిష్కరణ**

నవతెలంగాణ కంటేశ్వర్


చలోఢిల్లీ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

గత ముప్పై ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఎస్సీ వర్గీకరణ సాధనకోసం ఆగస్టు 10 వ తేదీన ఢిల్లీ లోని జంతర్మంతర్ వద్ద నిర్వహించ తలపెట్టిన నిరసన ధర్నా కార్యక్రమానికి మాదిగలు, ఉప కులస్తులందరు అధిక సంఖ్యలో తరలి రావాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు బి ఎన్ రమేష్ కుమార్ పిలుపు నిచ్చారు. ఈ మేరకు సోమవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముందుగా చలో ఢిల్లీ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేష్ కుమార్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ సాధన తోనే మాదిగలకు, వాటి ఉపకులస్తుల వారికి అన్ని విధాలుగా న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్ లో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పిస్తామని బీజేపీ అగ్ర నేతలు ఇచ్చిన హామీలు నీటి మూటలు గానే మిగిలాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ఇప్పుడు జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశ పెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 10, 11 తేదీల్లో ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున మాదిగలు తరలి రావాలని కోరారు.

అనంతరం నిజామాబాద్ జిల్లా నూతన కమిటీని నియమించారు. ఉమ్మడి జిల్లాల ఎమ్మార్పీఎస్ ఇన్చార్జి గంధమాల నాగభూషణం మాదిగ, నిజామాబాద్ జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడుగా డల్లా సురేష్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా నక్క రాజేందర్ మాదిగ, ప్రచార కార్యదర్శిగా సిద్దాపూర్ గంగాధర్ మాదిగ, జిల్లా అధికార ప్రతినిధిగా సంగెం కిష్టయ్య మాదిగ, ఎమ్ ఎస్ ఎఫ్ జిల్లా అధ్యక్షుడుగా మల్లాని శివ మాదిగ, మాదిగ యువ సేన జిల్లా అధ్యక్షుడు గా మట్టపు దీపక్ మాదిగ, నిజామాబాద్ నగర ఎమ్మార్పీఎస్ ఇన్చార్జి గా ఓ మల్ల శ్రీనివాస్, కో ఇన్చార్జి గా ఆర్సపల్లి సుమన్, కార్యవర్గ సభ్యులుగా సుభాస్, రమేష్, గణేష్, నియమక మయ్యారు.సమావేశంలో రాష్ట్ర నాయకుడు తాటి కాయల చిరంజీవి, ఉపాధ్యక్షుడు భాగయ్య, కామారెడ్డి ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చిట్యాల సాయన్న మాదిగ, మహిళా నాయకురాలు సుధా మాదిగ, సావిత్రి మాదిగ, తిరుపతి, అజయ్, గంగారాం పాల్గొన్నారు.

పూర్వ ప్రాథమిక విద్యను అందించాలి

- **అంగన్వాడి సెంటర్లను బలోపేతం చేయాలి**
- **ఇంచార్జ్ సీడిపిఓ ఆర్ జ్యోతి**



మాట్లాడుతున్న సీడీపీవో

నవతెలంగాణ-ఆర్మూర్

పూర్వ ప్రాథమిక విద్యను అందిస్తూ అంగన్వాడి సెంటర్లను బలోపేతం చేయాలని ఇన్చార్జ్ సిడిపిఓ ఆర్ జ్యోతి అన్నారు. పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో అంగన్వాడి టీచర్లకు సోమవారం ఈ సి సి ఈ శిక్షణ బ్యాచ్ ముగింపు కార్యక్రమం నిర్వహించినారు ..ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య రంభ దశలో చిన్నారులకు మెదడు అభివృద్ధి అతివేగంగా ఉంటుందని, పిల్లలకు మంచి వాతావరణంలో ఉండి పదేపదే అవకాశాలు కల్పించడం ద్వారా మెదడు అభివృద్ధిలో నాడీ కణాలు వృద్ధి జరుగుతుందని, మూడు నుండి ఆరు సంవత్సరాల దశలో పూర్వ ప్రాథమిక విద్య ప్రాముఖ్యత పిల్లలతో సమగ్ర అభివృద్ధి ప్రభావితం కనపరస్తాయని అన్నారు. జాతీయ విద్యా విధానంలో వచ్చిన మార్పుల ద్వారా పూర్వ ప్రాథమిక విద్యా దీపిక లో మార్పుల గురించి అభివృద్ధి క్షేత్రాలలో లక్ష్యాలను చేరుకొని సమగ్ర అభివృద్ధి సాధించవచ్చని, ఇది 20 30 వరకు చేరుకొని దిశగా పూర్వ ప్రాథమిక విద్యను అందించాలని అన్నారు. అంగన్వాడి సెంటర్లలో ప్రీ స్కూల్ పిల్లల నమోదు శాతాన్ని పెంచాలని అన్నారు.. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్స్ శ్రీదేవి ,రేఖ, పోషణ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ రాంబాబు, సూపర్వైజర్లు వెంకట రమణమ్మ, మాధవి, సమత, అనురాధ, నలిని, విలాస్, సాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులతో కిక్కిరుస్తున్న బ్యాంకులు

నవతెలంగాణ-కోటగిరి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్ష రూపాయల రుణమాఫీ చేయడంతో రైతులు కోటగిరి ఎస్‌బీఐ బ్యాంకులో సోమవారం వారి ఖాతాలలో డబ్బులు జమకావడంతో ఒక్కసారిగా బ్యాంకులోకి రైతన్నలు వారు డబ్బులు తీసుకోవడానికి వచ్చారు. ప్రతి ఒక్కరూ ఆనందంతో రుణమాఫీ తెలుసుకోవడం కోసం బయట వారి పేర్ల జాబితా చూసుకుంటూ లోపల బ్యాంకులో వారి డబ్బులను తీసుకున్నారు.

పేద ప్రజల సంక్షేమానికి కృషి చేస్తా

- **ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి**

నవతెలంగాణ-ఆర్మూర్

పేద ప్రజల సంక్షేమాటికి నిర్విరామ కృషి చేస్తానని ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని రైతు వేదికలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలూరు ఎమ్మార్వో నరేష్, డిటి హరీష్, మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్ మున్న, కౌన్సిలర్లు సుంకరి రంగన్న, ఆకుల రాము, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రిలీవ్ ఉత్తర్వులు అందజేత

నవతెలంగాణ-ధర్పల్లి

ఇటీవల ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీల అవకాశం కల్పించడంతో మండలంలోని ఆయా గ్రామాల్లో నాలుగు సంవత్సరాలుగా సేవలు పూర్తి చేసుకున్న గ్రామ కార్యదర్శులు ఆరుగురు బదిలీ అయినట్లు ఎంపిడిఓ బాలకృష్ణ తెలిపారు. సోమవారం వారికి తన ఛాంబర్‌లో రిలీవ్ ఆడర్లు అందించారు. బదిలీ అయిన వారిలో బాలకృష్ణ, తిరుపతి, రఘురామ్, రాజ్‌కుమార్ ఉన్నారు.

బీసీ డిక్లరేషన్‌పై తహసీల్దార్‌కు వినతి

నవతెలంగాణ-ముప్కాల్

బీసీ డిక్లరేషన్‌పై తహసీల్దార్ కార్యాలయంలో ఇంఛార్జి తహశీల్దార్ పి.శ్రీకాంత్‌కు బీజేపీ ఓబీసీ మోర్చా నాయకులు వినతిపత్రం సోమవారం సమర్పించారు. ఈ సందర్భంగా ఓబీసీ జిల్లా మోర్చా నాయకులు చిల్క దినేష్ మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారంలో ఆనాడు సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 6 నెలల్లో కులగణన చేసి బీసీ కమిషన్ ఆధారంగా బీసీలకు రిజర్వేషన్లు పెంచుతామని అన్నారు. స్థానిక సంస్థల్లో ప్రస్తుతం ఉన్న బీసీ రిజర్వేషన్లు 23శాతం నుంచి 43 శాతం వరకు పెంచుతామన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో బీసీ డిక్లరేషన్ పై చర్చించి నిర్ణయం తీసుకోవాలని వినతిలో పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గడ్డం సంతోష్‌రెడ్డి, జిల్లా నాయకులు ముస్కు నర్సయ్య, చిల్క దినేష్, బర్కుంట సాగర్, పెంటు గంగాధర్, కళ్ల స్వామి, కిషన్, మ్యాక నర్సయ్య, చిల్క గోపాల్, కెయం.రెడ్డి, రమేష్, లోక రాములు, మాజిత్, శ్రీనివాస్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న కార్యదర్శికి సన్మానం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని సిద్ధ రామేశ్వరనగర్ గ్రామంలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న సౌజన్యను గ్రామ బిజెపి పార్టీ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు సిద్ధు, హరింద్ర, ఆనంద్, నాగభూషణం, ఆదర్శ్, తరుణ్ పాల్గొన్నారు.

ఇసుక డంప్ సీజ్

నవతెలంగాణ-పోతంగల్

మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం మంజీరా వాగు వెళ్లేదారిలో వీరభద్రగుడి దగ్గర దాదాపు 12 ట్రిప్పుల ఇసుక డంపు గుర్తించి సీజ్ చేసినట్టు తహసీల్దార్ తెలిపారు.

ఏకరూప దుస్తులు పంపిణీ

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, బస్వాపూర్‌లో యూనిఫాం 2వ విడత ఏకరూప దుస్తులను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కస్తూర్బాగాంధీ గురుకుల వసతిగృహ పాఠశాలలో ప్రత్యేక అధికారి, ఎంపిడివో శ్రీనివాస్ ముఖ్య అతిథిగా, ఐకేపీ సిసిలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడీవో, ఏపీఎం, కేజీబీవి ప్రత్యేక అధికారి, సిసి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.